ఆంధ్రజ్యోతి
www.andhrajyothy.com

నిజామాబాద్
20 బుధవారం 30 ఆగస్టు 2017

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- తెలంగాణ సస్యశ్యామలం కోసమే కాళేశ్వరం పథకం
- ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోంది
- దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న సీఎం కేసీఆర్ పథకాలు
- జిల్లా ఎంపీ కవిత వెల్లడి

....వివరాలు 7లో


నందిపేటలో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీ కవిత


నేతల బలమెంత?

- ఉభయ జిల్లాల్లో పార్టీ నేతల పనితీరుపై సర్వే ఏజెన్సీల నజర్
- రాబోయే ఎన్నికల దృష్ట్యా నేతల బలాబలాలపై వివరాల సేకరణ
- సర్వత్రా ఆసక్తిరేపుతున్న సర్వే
- గోప్యంగా సాగుతున్న వైనం

ఉభయ జిల్లాల్లో సర్వే ఏజెన్సీలు ఓ ఆసక్తికర సర్వే చేపడుతున్నాయి. రెండు జిల్లాల పరిధిలో ఏ పార్టీలో నేతలు బలంగా ఉన్నారు.. వచ్చే ఎన్నికల సమయానికి వారు ప్రస్తుతం ఉన్న పార్టీలోనే ఉంటారా? వేరే పార్టీలోకి మారుతారా? రాష్ట్ర పథకాల అమలు ఎలా ఉంది? స్థానిక నేతలకు కేంద్ర పథకాలపై అవగాహన ఉందా? ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు? కుల సంఘాల పాత్ర ఎలా ఉంది.. బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతల ప్రభావం ఎంత వరకు ఉంది? తదితర అంశాలను సేకరిస్తున్నారు. ఏ సంస్థ సర్వే చేస్తోంది? ఎందుకు చేస్తోందనేది గోప్యంగా ఉంచుతున్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఈ సర్వే చేస్తున్నట్టు తెలుస్తున్నా.. రెండు జిల్లాల నేతలు, ప్రజల్లో మాత్రం ఆసక్తిని రేపుతోంది.

(ఆంధ్రజ్యోతి, నిజామాబాద్)





7

మంటగలుస్తున్న మానవత్వం!

..3లో

- జిల్లా కేంద్ర బస్టాండ్‌లో కన్న కూతురును బస్సులో వదిలి వెళ్లి.. తిరిగొచ్చి అక్కున చేర్చుకున్న తల్లి
- బాసరలో వృద్ధురాలిని వదిలేసిన బంధువులు


బంధువులు వదిలివేయడంతో బాసర ఆలయం వద్ద దీనంగా చూస్తున్న గంగవ్వ

'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు..' అంటూ సినీ గేయ రచయిత రాసిన పాట ప్రస్తుత సమాజంలో అక్షరసత్యమవుతోంది. ఇందుకు మంగళవారం చోటుచేసుకున్న రెండు ఘటనలనే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జిల్లా బస్టాండ్‌లో ఓ తల్లి తన 11నెలల బిడ్డను బస్సులో వదిలి వెళ్లి.. కొంతసేపటికి కన్నప్రేమ గుర్తుకొచ్చి పసిపాపను అక్కునచేర్చుకోగా.. నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రంలో ఆర్మూర్ మండలం ఆలూర్‌కు చెందిన సంతానం లేని వృద్ధురాలిని బంధువులు వదిలేసి వచ్చారు.


తల్లి వదిలి వెళ్లిన పసిపాప



రూ.100, 50 నోట్ల రద్దుపై వదంతులు!

- తప్పుడు ప్రచారంతో ప్రజల్లో నెలకొన్న ఆందోళన
- ప్రధాని ప్రసంగం వీడియోను మార్ఫింగ్ చేసిన పలువురు వ్యక్తులు
- బ్యాంకర్లు అనుమానాలను నివృత్తి చేయాలని ప్రజల వినతి

7

రెండు రోజులుగా సోషల్ మీడియాలో రూ.100, 50 నోట్లు రద్దయినట్లు జరుగుతున్న ప్రచారం సామాన్య జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఈ వదంతుల వ్యవహారం మార్కెట్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు ప్రధాని మోదీ చేసిన ప్రసంగం వీడియోను మార్ఫింగ్ చేసి పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇకనైనా ఈ వ్యవహారంపై బ్యాంకర్లు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నగర శివారులో మొరం దందా!

20

- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే కొనసాగుతున్న తవ్వకాలు
- మాట వినని అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్న వైనం
- తాము చెప్పిన రేటుకే కొనుగోలు చేయాలని ఆదేశాలు
- మాట విననివారి వాహనాలపై అక్రమంగా కేసుల బనాయింపు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పునరావాసానికి 35 ప్రతిపాదనలు

● తాలపల్లి శేఖర్, ఎక్సైజ్ సీఐ, మోర్తాడ్

గుడుంబా తయారీ, అమ్మకం మానుకున్నవారికి పునరావాసం కింద సర్కిల్ పరిధిలో 35 మందికి ప్రతిపాదనలు పంపించగా, అందులో 17 మందికి పలు యూనిట్లు మంజూరయ్యాయని ఎక్సైజ్ సీఐ తాలపల్లి శేఖర్ తెలిపారు. మిగిలినవారికి కూడా త్వరలో వివిధ యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్కిల్ పరిధిలో గుడుంబా తయారీ, అమ్మకాలు మానుకున్నవారికి పునరావాసం కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, పలు విషయాలను వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి: ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

ఎక్సైజ్ సీఐ: మోర్తాడ్ సర్కిల్ పరిధిలో కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఏర్గట్ల, మోర్తాడ్ తదితర మండలాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మీ పరిధిలో ఎన్ని టీఎఫ్‌టీ, టీఎస్‌సీలు ఉన్నాయి?

ఎక్సైజ్ సీఐ: సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 34 టీసీఎస్, 12 టీఎఫ్‌టీలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: నాలుగు మండలాల పరిధిలో మొత్తం ఎన్ని మద్యం దుకాణాలు ఉన్నాయి?

ఎక్సైజ్ సీఐ: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మొత్తం ఎనిమిది మద్యం దుకాణాలు ఉన్నాయి. మోర్తాడ్‌లో రెండు, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్, అంక్సాపూర్, పచ్చలనడ్కుడ గ్రామాల్లో ఒక్కో మద్యం దుకాణం ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: తెలంగాణా హరితహారం కింద ఈ సంవత్సరం ఎన్ని ఈత మొక్కలు నాటారు?

ఎక్సైజ్ సీఐ: సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో హరితహారం పథకం కింద లక్షా 77 వేల ఈత మొక్కలను నాటి లక్ష్యం సాధించాం. వీటిని చెరువు కట్టలు, కాలువలు, గీత కార్మికుల భూముల్లో నాటడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ కార్యాలయ పరిధిలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

ఎక్సైజ్ సీఐ: ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిదిమంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరత ఏమీ లేదు.

ఆంధ్రజ్యోతి: మీ పరిధిలో గుడుంబా తయారీ, అమ్మకాలు ఇంకా జరుగుతున్నాయా?

ఎక్సైజ్ సీఐ: సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టడం జరిగింది. ఎక్కడా కూడా గుడుంబా తయారీ, అమ్మకాలు జరగడం లేదు.

ఆంధ్రజ్యోతి: గుడుంబా తయారీ, అమ్మకం మానుకున్నవారు ఎంతమందికి పునరావాసం కల్పించేందుకు గుర్తించారు?

ఎక్సైజ్ సీఐ: గుడుంబా తయారీ, అమ్మకం మానుకున్నవారికి పునరావాసం కల్పించేందుకు ఆరు మండలాల నుంచి 35 ప్రతిపాదనలు పంపించాం. అందులో 17 మందికి పలు యూనిట్లు మంజూరయ్యాయి. 11 మందికి గొర్రెల యూనిట్లు, ఆరుగురికి ఆటోలను పంపిణీ చేశాం. మిగిలిన 18 మందికి మంజూరు రావాల్సివుంది.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో కల్తీకల్లు అమ్మకాలు జరుగుతున్నాయా?

ఎక్సైజ్ సీఐ: గ్రామాల్లో కల్తీకల్లు అమ్మకాలు జరగడంలేదు. ఈ విషయమై గ్రామాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మోర్తాడ్‌లో పరిసర గ్రామాల నుంచి కల్తీకల్లు తీసుకువచ్చి విక్రయిస్తున్నారని వినికిడి. చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా?

ఎక్సైజ్ సీఐ: ఈ విషయమై ఇంతవరకు మా దృష్టికి రాలేదు. తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో మీ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తోంది?

ఎక్సైజ్ సీఐ: ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ద్వారా ఎనిమిది మద్యం దుకాణాల ద్వారా 6 కోట్ల 31 లక్షల 20 వేల ఆదాయం వస్తుంది. అంతేకాక ఈసీఎస్, టీఎఫ్‌టీల ద్వారా నెలకు 2లక్షల 25వేల 560 రూపాయలు ప్రతి నెలా ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంది.

- మోర్తాడ్

హాకీలో తూంపల్లి విద్యార్థులు టాప్

● జాతీయస్థాయిలో ఒకరు.. రాష్ట్రస్థాయిలో 25 మంది ప్రతిభ ● అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతామంటూ ప్రతిజ్ఞ

మైదాన్



జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన తూంపల్లి విద్యార్థులు(ఫైల్)



ఒలింపిక్ డే సందర్భంగా మొదటి స్థానం పొందిన విద్యార్థులు (ఫైల్)

సిరికొండ: హాకీ క్రీడలో తూంపల్లి విద్యార్థులు జిల్లాలో టాప్ గేర్‌లో దూసుకువెళుతున్నారు. సిరికొండ మండలం తూంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 192 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందు లో వందమంది వరకు విద్యార్థులు హాకీ క్రీడలో మంచి ప్రావీణ్యతను కనబరుస్తున్నారు. వ్యాయామోపాధ్యాయుడిగా నగేష్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను పెంపొందించుకుంటున్నారు. బాలురతోపాటు బాలికలు సైతం హాకీ క్రీడలో రాణిస్తున్నారు. ఏడాదిన్నర కాలంలోనే హాకీలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి, జిల్లాకే పేరు తీసువచ్చిన ఘనత తూంపల్లి విద్యార్థి దినేష్‌కు దక్కింది. జిల్లా స్థాయిలో ఏ టోర్నమెంట్ నిర్వహించినా హాకీలో తామే గెలుపొందుతామని ఎంతో ఆత్మవిశ్వాసంతో ఇక్కడి విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికే మూడు టోర్నీల్లో విజయం సాధించి తమ సత్తా ఏమిటనేది నిరూపించారు. ఉమ్మడి జిల్లా, నేటి నిజామాబాద్ జిల్లాలో కూడా హాకీ క్రీడకు సంబంధించి తమకు ఎదురులేదని విద్యార్థులు ధీమా గా చెబుతున్నారు.

● జిల్లాస్థాయిలో రెండుసార్లు ప్రథమ స్థానం

ఇప్పటివరకు జిల్లా స్థాయిలో నిర్వహించిన హాకీ టోర్నమెంటులో రెండుసార్లు ప్రథమ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి టోర్నమెంట్, ఒలంపిక్ డే సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల పోటీలో తూంపల్లి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఖేల్ ఇండియా జిల్లాస్థాయి టోర్నమెంటులో రెండో స్థానంలో నిలిచారు.

●జిల్లా జట్టు విజయంలో తూంపల్లి విద్యార్థుల పాత్ర అమోఘం..

రాష్ట్రస్థాయిలో ఎప్పుడు హాకీ టోర్నమెంట్ జరిగినా, అందులో ఒకరిద్దరు తూంపల్లి విద్యార్థుల ప్రాతినిథ్యం ఖచ్చితంగా ఉంటుంది. జిల్లాజట్టు గెలుపులో తూంపల్లి విద్యార్థుల పాత్ర కీలకంగా ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో తూంపల్లి విద్యార్థుల సహకారం తప్పరిసరి అయింది. ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో జరిగిన టోర్నీల్లో జిల్లా జట్టుకు సంబంధించి తూంపల్లి విద్యార్థులు 25 మంది వరకు విద్యార్థులు ప్రాతినిథ్యం వహించారు.



ఖేలో ఇండియా పోటీల్లో రెండో స్థానం పొందిన తూంపల్లి విద్యార్థినులు(ఫైల్)

● జాతీయ స్థాయిలో ఆడిన దినేష్..

హాకీ జాతీయస్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు కే. దినేష్ అనే విద్యార్థి ప్రాతినిథ్యం వహించారు. హర్యానాలో జరిగిన పోటీల్లో దినేష్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొన్నాడు. దినేష్ హాకీలో మంచి నైపుణ్యాన్ని సంపాదించాడు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే తూంపల్లి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి తూంపల్లి గ్రామానికే వన్నె తీసుకువస్తున్నారు. ప్రభుత్వం, పీఈటీల ప్రోత్సాహం ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారనేందుకు తూంపల్లి విద్యార్థి దినేష్ నిదర్శనం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు అధిక ప్రాధాన్యతనిచ్చి అన్ని హైస్కూళ్లల్లో వ్యాయామోపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. ఇదిలావుండగా, హాకీ క్రీడలో ఏ మాత్రం నైపుణ్యం లేని తాము పీఈటీ సార్ వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే తాము జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగడం, హాకీ క్రీడలో జిల్లాకు పేరు తీసుకురావడంలో తాము భాగస్వాములం కావడం ఆనందంగానుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. క్రీడల్లో మరిన్ని మెలకువలను నేర్చుకోవాల్సింది ఉందని, పీఈటీ నగేష్ సార్ ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో పేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని వారంటున్నారు.

చాలా మెలకువలు తెలుసుకున్నా..



హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొని పలు మెలకువలు తెలుసుకున్నాను. ఈ పోటీలు నాకు ఎంతో మంచి అనుభూతి కలిగించాయి. ఈ మేరకు హాకీ క్రీడకు సంబంధించి చాలా విషయాలు నేర్చుకున్నాను. మరిన్ని మెలకువలు తెలుసుకుంటున్నాను.

- కే.దినేష్. జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు

అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటా..



గురువులు, తల్లిదండ్రుల సహకారంతోనూ, హాకీని నేర్పించిన ఉపాధ్యాయుడు నగేష్ సార్ ప్రోత్సాహంతో తాను రాష్ట్ర స్థాయికి ఎదిగాను. పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాను. గురువులు, తల్లిదండ్రుల సహకారంతో మరింత కృషి జరిపి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నిస్తాను.

- బీ.సరిత, రాష్ట్రస్థాయి హాకీ క్రీడాకారిణి

రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా కృషి

మారుమూల ప్రాంతమైన తూంపల్లి పాఠశాలకు హాకీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. ఉదయం పాఠశాలకు వచ్చిన వెంటనే విద్యతోపాటు క్రీడలో నైపుణ్యాలు, మెలకువలను వారికి నేర్పిస్తున్నాను, సాయంత్రం హాకీ క్రీడను ఆడించి, మంచి తర్ఫీదును అందిస్తున్నాను.

- నగేష్, పీఈటీ

ఆధ్యాత్మికం

ఆచమనం ఎలా చేయాలి?

● వాసుదేవశర్మ, వేద పండితుడు



పూజా కార్యక్రమాల్లో మొదట తప్పనిసరిగా ఆచమనం చేసి పూజను ప్రారంభించాలి. ఆచమనం తప్పనిసరిగా తూర్పునగానీ, ఉత్తరాభిముఖానగానీ కూర్చోవాలి. ఆచమనాన్ని మూడుమార్లు చేసి నాల్గవసారి పక్కనున్న తర్పణ పాత్రలో విడిచివేయాలి. ఆచమనం చేయడంలో అంతర్యం స్వరపేటికను పూజకు సిద్ధం చేయడం. ఆచమనంలో వేడి నీటినిగానీ, బాగా చల్లని నీటిని గానీ ఉపయోగించరాదు.

- నిజామాబాద్ కల్చరల్

లీడర్ వాయిస్

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల సమస్యలను పరిష్కరించాలి

● రాజేందర్ గౌడ్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి



ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. అర్హత కలిగిన హెచ్‌ఎంలకు గెజిటెడ్ హోదా కల్పించాలి. వేసవి సెలవుల్లోనూ మధ్యాహ్నం భోజనం విధులు నిర్వహిస్తున్నందున వారికి సంపాదిత సెలవు మంజూరుచేయాలి. ఉపాధ్యాయులకు వేసవిలోగా పదోన్నతులు కల్పించాలి. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి.

- ఆర్మూర్

మంటగలిసిన మానవత్వం బస్సులో పసిపాప.. ఆలయ మెట్ల వద్ద అవ్వ

- బస్సులో పసిపాపను వదిలేసిన ఓ 'తల్లి'
- అక్కున చేర్చుకున్న కండక్టర్
- 'తల్లి'ని విచారిస్తున్న పోలీసులు
- బాసరలో 80 ఏళ్ల అవ్వను వదిలించుకున్న ఆర్మూర్ మండలవాసి




పసిపాపను అక్కున చేర్చుకున్న పార్వతి.. నస్రీన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సుభాష్‌నగర్: మాతృత్వాన్ని మరిచిన ఓ తల్లి తన 11నెలల బిడ్డను బస్సులో వదిలి వెళ్లింది. ఆ పసిపాపను బస్సు కండక్టర్ పార్వతి అక్కున చేర్చుకుంది. గుక్కపట్టిన ఆ బిడ్డకు పాలిచ్చి లాలించింది. మంగళవారం నగరంలోని బస్టాండ్‌లో ఈ ఘటన జరిగింది. బాబాసాహెబ్ పహాడ్‌కు చెందిన నస్రీన్ తన పాప, తల్లితో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. అనంతరం బస్టాండ్‌కు వచ్చిన నస్రీన్ ఆదర బాదరాగా పసిపాపను బోధన్ డిపోకు చెందిన బస్సు (ఏపీ 28 జడ్ 5763) ఎక్కింది. అంతలోనే తాను బాత్‌రూంకు వెళ్లి వస్తానని చెప్పి పాపను బస్సు కండక్టర్ పార్వతికి అప్పచెప్పి వెళ్లింది. అంతే ఆ 'తల్లి' తిరిగిరాలేదు. దీంతో పార్వతి డ్రైవర్ మధుసూదన్‌తో కలసి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద పాప అదృశ్యమైందని సమాచారం రావడంతో పోలీసులు తల్లి నస్రీన్‌ను బస్టాండుకు తీసుకొచ్చారు. దీంతో నస్రీన్ ఆ పాప తన పాపే ననడంతో కథ సుఖాంతమైంది. కాగా సీసీ పుటేజీలో తల్లి అని వచ్చిన మహిళ, ఈమె ఒక్కరేనా అనే అనుమానంతో ఎస్ హెచ్‌వో రవీందర్ ఆమెను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


'మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు..' అంటూ సినీ రచయిత రాసిన పాట అక్షరసత్యమవుతోంది. జిల్లా బస్టాండ్‌లో ఓ తల్లి తన 11నెలల బిడ్డను బస్సులో వదిలి వెళ్లింది. ఆర్మూర్ మండలం ఆలూర్‌కు చెందిన వృద్ధురాలిని బంధువులు నిర్మల్ జిల్లా బాసరలోవదిలేశారు.



కన్నీళ్ల పర్యంతమవుతున్న గంగవ్వ


బాసర: బంధుత్వాలు దిగజారిపోతున్నాయనడానికి నిదర్శనం బాసరలో చోటుచేసుకుంది. ఎనభై ఏళ్ల వృద్ధురాలిని భారంగా భావించి సంబంధికులు వదిలించుకున్నారు. ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన విఠల్-గంగవ్వ దంపతులకు పిల్లలు లేరు. భర్త చనిపోవడంతో ఒంటరైన గంగవ్వ తన మేనల్లుడు వడ్ల నర్సయ్య వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో నర్సయ్య ఆమెను ఊరికి వెళ్దామని చెప్పి ఆటోలో ఎక్కించాడు. ఉదయం ఏడు గంటలకు నిర్మల్ జిల్లాలోని బాసర ఆలయం మెట్ల వద్ద వదిలేసి వెళ్లాడు. ఈ విషయం తెలియని గంగవ్వ తన వాళ్లు కనపడక తల్లడిల్లిపోతోంది. ఊరు ఆలూర్ అని.. బ్యాంకు సమీపాన ఉంటామని, మేనల్లుడు తనను వదిలి వెళ్లాడని విలపిస్తోంది.

ప్రాజెక్టుల సమాచారం



	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	నీటి చేరిక (క్యూసెక్కుల్లో)	విడుదల (క్యూసెక్కుల్లో)
శ్రీరాంసాగర్	1,091.90	1,070.50	90.31	29.934	16,642	50
నిజాంసాగర్	1,405.00	1,385.75	17.802	2.573	1643	509

బంగారం ధరలు



బిస్కెట్ బంగారం	10 గ్రాములకు	రూ. 30,900
ఆర్నమెంట్ బంగారం	10 గ్రాములకు	రూ. 30,500
వెండి	10 గ్రాములకు	రూ. 435

సినిమా గైడ్ నిజామాబాద్



లలితమహల్	:	జయ జానకి నాయక 11.15, 2.15, 6.15, 9.15
అశోక్	:	వివేకం - 11.15, 2.15, 6.15, 9.15
నటరాజ్	:	నేనే రాజు నేనే మంత్రి - 11.15, 2.15, 6.15, 9.15
విజయ్	:	ఫిదా - 11.15, 2.15, 6.15, 9.15
శ్రీదేవి	:	ఆనందోబ్రహ్మ - 11.15, 2.15, 6.15, 9.15
దేవి	:	అర్జున్‌రెడ్డి - 11.15, 2.15, 6.15, 9.15

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్ 1 - వీఐపీ-2 - 10.50, 7.35, 10.35
ఆనందో బ్రహ్మ - 1.30. అర్జున్‌రెడ్డి - 4.00
స్క్రీన్ 2 - అర్జున్‌రెడ్డి - 10.20 వివేకం - 04.40
జయ జానకి నాయక - 1.40, 7.40
ఆనందోబ్రహ్మ - 10.30
స్క్రీన్ 3 - అర్జున్‌రెడ్డి - 9.50, 1.20, 7.25, 10.45
నేనే రాజు నేనే మంత్రి - 4.35

- నిజామాబాద్ అర్బన్

అనాథను దత్తత తీసుకున్న హైదరాబాద్ దంపతులు



చిన్నారిని దత్తత తీసుకున్నవారికి అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ స్రవంతి

ఇందూరు: శిశుగృహలో సంరక్షణ పొందుతున్న చిన్నారిని మంగళవారం హైదరాబాద్‌కు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జరిగిన కేటాయింపులో హైదరాబాద్‌కు చెందిన దంపతులు కందిపాటి కృష్ణవేణి, ప్రవీణ్‌లకు 7 నెలల చిన్నారిని ఐసీడీఎస్ పీడీ స్రవంతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో చైతన్యకుమార్, మెడికల్ ఆఫీసర్ నాగరాజు, మేనేజర్, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు మోటారు చోరీ.. ఒకరి అరెస్టు



చోరీకి పాల్పడ్డ కిషన్‌ను ప్రశ్నిస్తున్న దృశ్యం

ఎడపల్లి: మండలంలోని బాపునగర్ శివారులో వ్యవసాయ బోరు మోటారు చోరీకి పాల్పడిన వ్యక్తిని మంగళవారం స్థానిక రైతులు పట్టుకున్నారు. వారం రోజుల క్రితం జైతాపూర్‌నకు చెందిన రైతు సతీష్ పొలంలోని వ్యవసాయ బోరు మోటారును కిషన్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లి కొద్ది దూరంలో ఉన్న తన పొలంలో దాచి పెట్టాడు. అతని అనుమాన ప్రవర్తనను గుర్తించిన స్థానిక రైతులు పట్టుకుని గట్టిగా ప్రశ్నించగా చోరీకి పాల్పడిన విషయాన్ని ఒప్పుకున్నాడు. స్థానికులు మోటారును స్వాధీనం చేసుకుని, నిందితుడు కిషన్‌ను ఎడపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి కిషన్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ఆసిఫ్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

టీయూ ఆర్థిక శాస్త్ర అధిపతిగా డాక్టర్ జాన్సన్



డాక్టర్ జాన్సన్‌కు నియామకపత్రం ఇస్తున్న వీసీ ప్రొఫెసర్ సాంబయ్య

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగాధిపతిగా డాక్టర్ జాన్సన్ దామెర నియమితులయ్యారు. మంగళవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సాంబయ్య ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జాన్సన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో డాక్టర్ జాన్సన్ రెండేళ్లపాటు ఉంటారు. అనంతరం ప్రొఫెసర్ సాంబయ్య మాట్లాడుతూ సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించి అకాడమిక్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సంపత్, కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు దత్తహరి, శ్రీనివాస్ తదితరులు జాన్సన్‌ను పూలమాలలు, శాలువలతో సన్మానించారు.

హలో..హలో..

ఆర్మూర్ పట్టణ అధికారుల ఫోన్ నెంబర్లు

కమిషనర్	9849904276	ఆర్వో	9849981964	ఏసీపీ	9440795404
మేనేజర్	9849981643	టీపీబీవో	9849370736	ఎస్‌హెచ్‌వో	9440795411
డీవైఈఈ	9849371147	ఏటీవో	8099867771	ఎస్సై	9440795434
ఎంఏఈ	9849981642	ఎస్‌టీవో	9866809387	ఎంపీడీవో	9849900107
టీపీవో	9849981642	సబ్ రిజిస్ట్రార్	9849031470	ఎంఈవో	9440899033

ఇంటర్వ్యూ

అర్హులైన అందరికీ పింఛన్లు



విజయ్‌సింగ్, మున్సిపల్ క్లర్క్,ఆర్మూర్

ఆంధ్రజ్యోతి: ఒంటరి మహిళలు పింఛన్ కోసం ఎందరు దరఖాస్తు చేసుకున్నారు?

క్లర్క్: ఒంటరి మహిళలకోసం 177 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి: దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలకు ఎందికి పింఛన్ మంజూరు అయ్యాయి. ?

క్లర్క్:151 మంది ఒంటరి మహిళలను ఎంపిక చేయగా 132 మంది మహిళలకు పింఛన్ మంజూరు చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎందరికి పింఛన్‌లు మంజూరయ్యాయి.?

క్లర్క్:ఇప్పటి వరకు ఆరువెయ్యిల రెండువందల అరవైరెండు మంది పింఛన్‌లు లబ్ధి పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి:ఆసరా పింఛనులు ఎందరూ లబ్ధిపోందుతున్నారు.?

క్లర్క్:ఆసరా పింఛన్లు 3825 మంది, జీవన భృతి 2437మంది లబ్ధి పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: పింఛనుల దరఖాస్తు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?

క్లర్క్:పింఛనుల దరఖాస్తు చేసుకున్న నెలలోపు అర్హులైన వారందరికి మంజురు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఏమి పెండింగ్‌లో లేవు.

ఆంధ్రజ్యోతి: ఇంట్లో ఎందరికి పింఛన్‌లు మంజూరు చేస్తున్నారు.?

క్లర్క్:ప్రభుత్వ నిబంధన మేరకు సమగ్ర సర్వే ఆధారంగా ఇంటి కొకరికి మంజూరవుతున్నాయి. త్వరలో ప్రభుత్వం కుటుంబంలో అత్తకోడలుకు మంజూరు కానున్నాయి.

ఆర్మూర్ అర్బన్

లెన్స్ స్టోరీ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పట్టణంలోని హుస్నాబాద్ కాలనీ ధనలక్ష్మీ కల్యాణ మండపం వెనుక ట్రాన్స్‌ఫార్మర్‌లు కంచెలేకపోవడం ప్రమాదకరంగామారింది. ఈకాలనీలో ట్రాన్స్‌పోర్టు ఉండటంతో వాహనాలు వస్తుపోతుంటా యి. అకస్మత్తుగా ఎవరైన తాగిన మైకంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుంటే మరణిం చడమే కాయం. వెంటనే అధికారులు ట్రా న్స్‌ఫార్మర్ చుట్టు కంచెను ఏర్పాటు చేయాలి.

ఆర్మూర్ అర్బన్

పట్టణంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు అస్తవ్యస్తం



అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువ

జర దేఖో!!



గుంతలమయంగా మారిన రోడ్డు

ఆర్మూర్ అర్బన్ : ఆర్మూర్ పట్టణంలోని ముక్కలచ్చయ్య దుకాణం పక్క వీధిలో సమస్యలు తిష్టవేశాయి. హుస్నాబాద్ కాలనీలోని ఈ మార్గం సీసీరోడ్డు మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. సుమారు 20ఏళ్లు గడుస్తున్నా ఈమార్గం సీసీరోడ్డు ఏర్పాటుకు నోచుకోవడం లేదు. ఈ వీధి 19వ వార్డు 20వ వార్డు శివారు కావడంతో ఈ మార్గం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ మార్గంలో దుకాణ సముదాయలు ఉన్నాయి. ఈ మార్గం గుండా అంగడీ బజార్‌కు వెళ్తుంటారు. ఈ మార్గం గుండా వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీలకు బండరాళ్లు కూలడమేకాకుండా మున్సిపల్ సిబ్బంది సక్రమంగా మురుగుకాలువలు తీయడం లేదని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. కాలువలలో మురుగు నీరు నిలిచి పందులకు ఆవాసంగా మారింది. ప్రధాన మురుగు కాలువలో మురుగు నీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 19, 20వ వార్డు పరిధిలో ఉండటంతో పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం కురిసిన ఈ మార్గం నీటితో నిండిపోతోంది. వెంటనే పాలకులు స్పందించి ఈ మార్గంలో సీసీరోడ్డు వేయాలని, మురుగు కాలువలకు మరమ్మత్తులు చేపట్టి నిత్యం మురుగు కాలువలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని దుకాణాదారులు ప్రజలు కోరుతున్నారు.

మురికి, చెత్తను తొలగించాలి..



మురుగు కాలువలో నిలిచిన నీటితో దుర్గంధం వ్యాపిస్తోంది. మున్సిపల్ సిబ్బంది రెండు,మూడు నెలలకు ఒక్కసారి మురుగు కాలువలు తీస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి మురుగు నీరు సక్రమంగా పారేల అధికారుల చర్యలు చేపట్టాలి.

- బొబిడేరాజ్‌కుమార్, ఆర్మూర్

సీసీరోడ్డు నిర్మించాలి..



ఈ దారిలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మురుగు కాలువలు, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో దుకాణాలకు కొనుగోలు దారులు సైతం రావడంలేదు. వెంటనే సీసీరోడ్డు నిర్మించాలి. మురుగు కాలువలలో చెత్తను తొలగించాలి.

- కుబీర్ దత్తాద్రి, ఆర్మూర్

ఫత్తేపూర్‌లో తెలుగు భాషా దినోత్సవం

ఆర్మూర్ రూరల్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు బాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రాచీన హోదాతో తెలుగు భాషను బతికించుకోవాలని సూచించారు. తమ పిల్లలకు తెలుగు రాకున్న పర్వాలేదన్న దురాభిప్రాయాన్ని తల్లిదండ్రులు వీడాలని కోరాడు. పాలనలో బోధనలో తెలుగుకు సముచిత ప్రాధాన్యతనిస్తూ తెలుగు భాషను గౌరవించి పాలకులు బతికించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యుడు జిందం నరహరి, ఉపాధ్యాయులు సౌడ రవి, రవిందర్‌గౌడ్, సుదర్శన్, రాజేశ్వర్, చంద్రకళ, చౌహన్, గంగాప్రకాశ్, సంతోష్ పాల్గొన్నారు.



తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవనాథ సిద్ధుల గుట్టపై ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ఆర్మూర్ అర్బన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టను మంగళవారం ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సందర్శించారు. సిద్ధుల గుట్టపై గల శివాలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకుముందు ఎంపీ, ఎమ్మెల్యేలను ఆలయకమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం నందిపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్తు మార్గ మధ్యలో జెమ్మన్ జెట్టి వీధిలో గల ప్రిన్స్‌యూత్ గణేష్ మండ పంలో ప్రతిష్ఠించిన గడ్డి గణపతిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వాతిసింగ్ బబ్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్, జడ్పీటీసీ సొందన్న, కౌన్సిలర్‌లు కోక్కుల రమాకాంత్, పండిత్ ప్రేమ్, మల్యాల రాజబాబు, కో-ఆప్షన్ సభ్యుడు ఫోల మధుకర్ , నాయకులు ఖాందే శ్రీనివాస్, జాగిర్ధార్ శ్రీనివాస్, చెన్నరవి, అయ్యప్ప శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై సెమినార్ పోటీలు



సెమినార్‌లో గెలుపొందిన విద్యార్థులు

ఆర్మూర్ రూరల్: ఆర్మూర్‌లోని ఎమ్మార్సీలో మంగళ వారం విద్యార్థులకు మండల స్థాయిలో సైన్స్ సెమినార్ నిర్వ హించారు. స్వచ్ఛభారత్, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాం యొక్క పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతి మ బహుమతి సుమలత (కేజీబీవీ) ద్వితీయ బహుమతి అర్షియల్ పిరదీస్ (జడ్పీటీసీ సైదాబాద్) తృతీయ బహుమతి ఈశ్వర్ (శ్రీభాషిత హైస్కూల్) సాధించారని ఎంఇవో రాజగం గారాం తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతులు అందజే శారు. ద్వితీయ బహుమతులు సాధించిన విద్యా ర్థుల ను జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో రిఫోర్స్ పర్సన్‌లు రమేష్, రఘునాథ్, అంబుజా రాణి, మల్లేష్, గంగాధర్ పాల్గొన్నారు.

'చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి'



రాంపూర్‌లో క్షేత్రప్రదర్శన చేస్తున్న వ్యవసాయాధికారులు

ఆర్మూర్ రూరల్ : పంటలో చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి. గోపి అన్నారు. ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై సోయా విత్తనాలు సరఫరా చేశామన్నారు. సోయ, వరి పంటలలో చీడ పీడల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోయా పంటలో లద్దె పురుగు ఆశిస్తోందని నివారణ చర్యలను వివరించారు. అనంతరం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కాక్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగాధర్, ప్రశాంత్, గంగారాం, సాయన్న, ఎఇవో శరత్‌చంద్ర, రైతులు పాల్గొన్నారు.

కోమన్‌పల్లి పాఠశాలలో చోరీ

ఆర్మూర్ రూరల్ : ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి మైక్‌సెట్‌ను ఎత్తుకెళ్లారు. పాఠశాల భవనంలోని పై అంతస్తులోని తరగతి గదికి వేసి ఉన్న తాళం పగల గొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు మైక్‌సెట్‌ను ఎత్తుకెళ్లినట్టు సర్పంచ్ అబ్బగొని అనురాధ తెలిపారు. పాఠశాలలో చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

కోమన్‌పల్లిలో ఆసరా పింఛన్ల పంపిణీ

ఆర్మూర్ రూరల్: ఆర్మూర్ మండలం కోమన్‌పల్లిలో ఆసర పింఛన్లను మంగళవారం సర్పంచ్ అబ్బగోని అనురాధ పంపిణీ చేశారు. గతంలో రాని లబ్ధిదారులు తిరిగి దరఖాస్తు చేసుకోగా 12 మంది మహిళలకు పింఛన్లు మంజూర య్యాయని సర్పంచ్ తెలిపారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సహకా రంతో గ్రామంలో అర్హులైన వారందరిని పింఛన్లు అందుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హలో..హలో.. నందిపేట్ మండల అధికారుల ఫోన్ నెంబర్లు

తహసీల్దార్	9491036913	వైద్యాధికారి	8897969543	ఎస్ఐ	9440795436
ఎంపీడీవో	9989050838	పశువైద్యాధికారి	9491377744	హౌసింగ్ ఏఈఈ	7799722949
ట్రాన్స్‌కో ఏడీఏ	9440811622	ట్రాన్స్‌కోఏఈ	9440811621	డిప్యూటీ తహసీల్దార్	984842003
ఎంఈవో	9949966300	ట్రాన్స్‌కోఏఈ నూత్‌పల్లి	9440811622	మండల వ్యవసాయాధికారి	8886613133
ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ	9959558287				

ఎంఆర్ వ్యాక్సిన్‌ను పరిశీలించిన డబ్ల్యూహెచ్‌వో పరిశీలకుడు

ఆర్మూర్ రూరల్ : ఆర్మూర్ మండలం మామిడిపల్లిలో మంగళవారం మీజిల్స్, రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్‌వో పరిశీలకుడు డాక్టర్ చైతన్య కుమార్ పరిశీలించారు. మానస లిల్లిపుట్ , నలంద తదితర ప్రైవేట్ పాఠశాలలో దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎంఆర్ టీకాలు వేశారు. మంగళవారం 2417 మంది విద్యార్థులకు టీకాలు వేయాల్సి ఉండగా 2316 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు దేగాం పీహెచ్‌సీ వైద్యాధికారిని స్వాతి వినూత్న తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇవో నాగరాజు, శంకర్,ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ మండలం వన్నెల్(బి)లో మీజిల్స్, రూబెల్లా నివారణ వ్యాక్సినేషన్ శిభిరాన్ని మంగళవారం రాష్ట్ర పరిశీలకులు చేతన్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వేసుకునేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహాణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సుధీర్‌బాబు, సాయి,హెల్త్ సూపర్‌వైజర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో జాతీయ సైన్స్ సెమినార్

మాక్లూర్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం జాతీయ సైన్స్ సెమినార్ మండలస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారి రాజ్‌గంగారెడ్డి తెలిపారు. కార్యక్ర మానికి న్యాయనిర్ణేతలగా తనతో పాటు కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీహరిలు పాల్గొన్నారు.

'అమరుల స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాన్ని నిర్మిద్దాం'

ఆర్మూర్: పెంచిన విద్యుత్ చార్జిలు తగ్గించాలని గతంలో జరిగిన ఉద్యమంలో బషీరాబాద్ కాల్పుల్లో అమరులైన వారి పోరాట స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాన్ని నిర్మిద్దామని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్ అన్నారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో మగళవారం అఖిల బారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అధిధిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కంచ్చెల రంగయ్య, వి. ప్రభాకర్, ఆకుల పాపయ్య, పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీలు

బాల్కొండ: అక్టోబర్ 1 2016 నుంచి మే 31 2017 వరకు 8 నెలలు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అశోక్, ఎస్ఆర్పీలు కుమార్, రంజీత్, రవి, డీఆర్పీలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం

మాక్లూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ బుచ్చయ్య మాట్లాడుతూ గ్రామాలలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీలు తమ బాధ్యతను తప్పక నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని అంతేకాకుండా రాత్రివేళలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన గణపతి మండపాల వద్ద నిర్వాహకులు మంగళవారం అన్నదాన కార్యక్రమాలు జోరుగా నిర్వహించారు. భారత్ స్నేహా యూత్, వన్నెల్(బి)లో గురడి రెడ్డి సంఘం ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

భీమ్‌గల్ : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమ్‌గల్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ కళాశాలలో మంగళవారం వినాయకుడికి ఆ కళాశాల విద్యార్థినిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారుని ఖాతాలోకే పరిహారం

- పక్షం రోజుల్లో ఇన్‌పుడ్ సబ్సిడీ రైతులకు చేరాలి
- జనాభా ప్రాతిపదికన గొర్రెల యూనిట్లు మంజూరు
- ఫైర్ స్టేషన్, 30 పడకల ఆస్పత్రికి హామీ
- మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీ కవిత

నందిపేట: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఖరీప్ సీజన్ నుంచి ఎరువుల కొనుగోలుకు ఎకరాకు రూ.4వేలు చొప్పున ఇచ్చే పరిహరం నేరుగా పట్టాదారుని ఖాతాలోకే వెళ్తుందని, కౌలు దారులతో సంబంధం లేదని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలో ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో ఎంపీపీ యమున అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వాంచారు. ఈ సందర్బంగా ఎంపీ కవిత జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవీంధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో రివ్యూ చేశారు. బస్‌డిపో నిర్మాణమే కాకుండా ఫైర్ స్టేషన్, 30 పడకల ఆస్పత్రి మంజూరుకు ఎంపీ కవిత హామీ ఇచ్చారు. నందిపేటలో వివేకానంద చౌరస్తా నుంచి బజార్ కొత్తూర్ వరకు, అలాగే షాపూర్ రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణంకు సర్వే చేయాలని, నిధుల మంజూరు ప్రతిపాదనలు పంపాలని ఈఈ హన్మాంత్ రావును ఎంపీ కవిత ఆదేశించారు. లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమలు తేవడానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులతో సంప్రదింపులు జరిపామని, సోయా, సీడ్ ప్రాసేసింగ్‌ను త్వరలోనే చేపడతామని ఆమె తెలిపారు.

'డీ1పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఆదేశాలిస్తాం'

శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో బాధితులకు ఇచ్చిన డి1 పట్టాలు రిజిస్ట్రేషన్ జరిగేలా కమీషనర్ స్థాయిలో సంబంధిత శాఖకు ఆదేశాలిస్తామని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ రవీంధర్ రెడ్డి తెలిపారు. అందుకు రైతులు దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో కృష్ణమూర్తి, ఆర్డీవో శ్రీనివాస్, సీడీపీవో ఉషారాణి, జడ్పీటీసీ స్వాతి, వైస్ ఎంపీపీ గంగాధర్, సర్పంచ్‌లు మీసాల సుదర్శన్, మంగ్లారపు ధర్మన్న, మండల కోఆప్షన్ సభ్యులు మజారోద్దిన్, తహసీల్దార్ ఉమాకాంత్ రావు, ఎంపీడీవో నాగవర్ధన్, పశు వైద్యాధికారి డాక్టర్ ప్రభాకర్, వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఏవో గంగమల్లు తదితరులు ఉన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

నందిపేటలో ఎంపీ, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

మండలంలోని వెల్మల్, నందిపేట, డొం కేశ్వర్ గ్రామాల్లో మంగళవారం నిజామాబాద్ ఎంపీ కల్వ కుంట్ల కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిలు సుడిగాలి పర్యటన చేశారు. మూడు గ్రామాల్లో రూ.కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. గొల్ల, కుర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ చేపట్టారు. నందిపేటలో రూ.32లక్షలతో నిర్మించిన స్త్రీ శక్తి భవనాన్ని ప్రారంభించారు. వెల్మల్‌లో బైపాస్ రోడ్డును పరిశీలించారు. పంచాయతీ రాజ్ నుంచి ఆర్అండ్‌బీకి మార్చామని, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎంపీ కవిత హామీ ఇచ్చారు. డొంకేశ్వర్‌లో నక్కల భూమేష్ తెలిపారు. ముందుగా నందిపేటలో స్త్రీ శక్తి భవనాన్ని ప్రారంభిస్తారని, మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని, గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ చేస్తారని వివరించారు. అలాగే డొంకేశ్వర్ గ్రామంలో ఆర్‌వీఎం కింద రూ.10లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని రూ.16లక్షలతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభించారు. రూ.22.50లక్షలతో నిర్మించనున్న ఎల్లమ్మ ఆలయం, సెంటర్ లైటింగ్ నిర్మాణం పనులకు, 2.36కోట్లతో లిఫ్ట్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మెన్ ఎస్ఏ అలీం, జిల్లా జాయింట్ కలెక్టర్ రవీంధర్ రెడ్డి, జెడ్పి వైస్ చైర్మెన్ గడ్డం సుమనా రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు డాంగే స్వాతి, ఎంపీపీ యమున, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏర్రం లింగం, ఉల్లి శ్రీనివాస్ గౌడ్, వాకిడి కార్తీక్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మోహన్ రావు, వైస్ ఎంపీపీ గంగాధర్, జిల్లా నాయకులు దాదన్నగారి విఠల్ రావు, మండల పార్టీ అధ్యక్షులు నక్కల భూమేష్, సర్పంచ్‌లు షాకీర్ హుస్సేన్, దొబ్బల రాజు, గుద్దేటి హరిదాస్, ఎంపీటీసీ సభ్యులు చింత బాల గంగాధర్, డాక్టర్ అహ్మద్ ఖాన్, గాండ్ల నర్సుబాయి, కోట గంగామణి, కుమ్మరి సురేంధర్, పీఏసీఎస్ చైర్మెన్లు మోర్తాడ్ భోజారెడ్డి, లక్ష్మినారాయణ, బాపురావు, డి ప్రభాకర్, వీడీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

రూ.2 వేల కోట్లతో అభివృద్ధి: ఆర్మూర్ ఎమ్మెల్యే

ఆర్మూర్ నియోజక వర్గంలో సుమారు 2వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి తెలిపారు.

డొంకేశ్వర్‌లో మన ఊరు-మన ఎంపీ

మండలంలోని డొంకేశ్వర్ గ్రామంలో మంగళవారం రాత్రి మన ఊరు-మన ఎంపీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా ఎంపీ కల్వకంట్ల కవితకు గ్రామస్తులు బతుకమ్మలు, మంగళ హరతులు, గంగాపుత్రలు సాంప్రదాయ పద్దతిలో వర్తులాకారవల, బెలూన్లతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల మద్య గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారితో కలిసి ఆమె పాద యాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిదాస్, లిఫ్ట్ చైర్మన్ బాపురావు, నాయకులు బార్ల పెద్ద సాయరెడ్డి, కల్లెం గంగారెడ్డి, ఉన్నారు.

మామిడిపల్లిలో ముగిసిన హాకీ టోర్నీ

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మండలం మామిడిపల్లిలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి సిక్స్‌ఏ సైడ్ ఇన్విటేషన్ హాకీ టోర్నమెంట్ ముగిసింది. టోర్నీలో 8 బాలుర జట్లు, 6 బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో తూంపల్లి జట్టు ప్రథమ స్థానం, జ్ఞాన్ పీఠ్ రెండో స్థానం, మిర్దాపల్లి మూడో స్థానంలో నిలువగా, బాలుర విభాగంలో తూపంల్లి జట్టు ప్రథమ, ఆర్మూర్ ద్వితీయ, మిర్దాపల్లి తృతీయ స్థానంలో నిలిచాయి. మంగళవారం రాత్రి ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి టీఆర్ఎస్ నాయకుడు బాజిరెడ్డి జగన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ రెడ్డి, నిట్‌శేఖర్, దేవరాజ్, మానస గణేష్, ఎస్. రమణ, ప్రసాద్, బాస్ రమేష్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాజిరెడ్డి జగన్

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో బాల్కొండ విద్యార్థికి కాంస్య పతకం

బాల్కొండ: వరంగల్ జిల్లా వర్ధన్న పేటలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ టోర్నీలో బి. నరేంద్ర ఉత్తమ ప్రతిభకనబర్చి కాంస్యపతకం సాధించినట్లు బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు దేవానందం తెలిపారు. జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రదర్శన ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆయన మెడల్‌తో అభినందించారు. మరిన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిడి మల్లేష్ గౌడ్, పాల్గొన్నారు.

'ముంపు బాధితులకు పరిహారం ఇవ్వాలి'



నందిపేట: మండలంలోని ముంపు బాధితులకు ప్రభు త్వం పరిహారం ఇవ్వాలని మండల తెలుగు యువత నాయ కులు నాగ తారక డిమాండ్ చేశారు. శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మండలంలోని సుమారు 14 గ్రామాలు ముంపునకు గురైనాయని, లోక అదాలత్‌కు వెళ్లిన కొన్ని గ్రామాల ప్రజలకు మాత్రమే ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని పేర్కొన్నారు. నిరక్ష్యరాశ్యత కారణంగా కోర్టుకు వెళ్లని బాధితులకు పరిహారం అందలేదని, పాలకులు స్పందించి పరిహారం మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తారక డిమాండ్ చేశారు. జీవన భృతి కింద అప్పటి ప్రభుత్వం రూ.5వేలు చొప్పున ప్రకటించిందని, అవి నేటికి అందలేవని, అదే భృతి కింద ప్రస్తుతం ఒక్కోక్క బాధితునికి రూ.5లక్షల చొప్పున అందజేయాలని తెలుగు యువత మండల నాయకులు నాగ తారక ప్రభుత్వంను కోరారు.

'కార్మిక వ్యతిరేక జీఎస్టీని వ్యతిరేకించాలి'

ఆర్మూర్ రూరల్ : కార్మిక రంగానికి వ్యతిరేకంగా వున్న జిఎస్‌టిని వ్యతిరేకించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో మంగళవారం తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యశివాజి, రాజశ్రీ, విజయ, సత్యవతి, వీణ,శోభ , రుచిత, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని ధర్నా

మాక్లూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికలకు ముందు దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చిన అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. మండలంలో ప్రభుత్వ భూమి ఉందని అంతే కాకుండా మరికొంత భూమిని అక్రమార్కులు ఆక్రమించుకున్నారని అట్టి భూమిపై రెవెన్యూ శాఖ అధికారులు సర్వే జరిపించి అర్హులైన దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయ లేదని వెంటనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని కోరారు. అంతేకాకుండా ఉపాధి హామీ కూలీలకు గత ఆరునెలల నుంచి బిల్లులు చెల్లించలేదని వారి జీవనవిధానాకి ఆటంకం కలుగుతుందని వెంటనే నిరుపేద ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించాల న్నారు. ధర్నా సుమారు అరగంట వరకు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నగేష్‌గౌడ్, ఎల్లయ్య, మహ్మద్, సీపీఐ మండల కార్యదర్శి పాల్గొన్నారు.

తాతయ్య కోసం.. ఓ యాప్



క్లిక్ అండ్ ఫైండ్

ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్స్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'


- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



చెప్పగలరా?

జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి




మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



జవాబులు

చెప్పగలరా?: జాతీయం
జంతర్ మంతర్: 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
జంబ్లింగ్ వర్డ్స్: 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి
పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి



పదాలు గుర్తించండి

shoe
duck
doll
globe
block
green



x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీలఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....

నేతల పనితీరుపై సర్వే ఏజెన్సీల నజర్



(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

రాబోయే ఎన్నికలకు ప్రధాన పార్టీల ఇప్పటి నుంచే కసరత్తును ప్రారంభించాయి. అంచనాలు వేయడంపై దృష్టి సారించాయి. వచ్చే ఎన్నికలలో ఎవరెవరు పోటీ పడుతారు, అధికార పార్టీలో సిట్టింగ్‌లో ఉన్న ప్రతిపక్ష పార్టీల నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయాలపై కేంద్ర ఏజెన్సీల ద్వారా ఈ సర్వే కొనసాగుతోంది. ప్రైవేటు సర్వే పేరుతో నిర్వహిస్తున్న ఢిల్లీలోని ఒక ఏజెన్సీ తమకు పని అప్పగించిందని వారు చెబుతున్నారు. సమాచారం సేకరిస్తున్నారు. గతకొన్ని రోజులుగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో సర్వే కొనసాగుతోంది. సీఎం కేసీఆర్ 4వ విడత సర్వే చేపిస్తానని ఎమ్మెల్యేలకు ఇదివరకే తెలిపారు. అదే కాకుండా కేంద్ర ప్రభుత్వంతో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఆయా రాష్ట్రాలలో ఈ సర్వేలు చేపిస్తున్నారు. తాము అధికారంలో లేని రాష్ట్రాలలో బలమైన నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారు. వీటితో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా రాష్ట్రంలో ఈ సర్వేలో చేపిస్తున్నారు. ఇవి ఏ సర్వేలో స్పష్టం చేయకున్నా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలతో పాటు మహిళల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. గతంలో లాగా కేవలం అభిప్రాయాలే కాకుండా సమగ్రంగా నియోజకవర్గ ముఖచిత్రం వచ్చే విధంగా సమాచారం సేకరిస్తున్నారు. ఈ రెండు జిల్లాల పరిధిలో అందరూ టీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉన్నారు. స్థానిక సంస్థలలో వారే ఉన్నారు. ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఏ విధమైన స్పందన ఉందో వివరాలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతమందికి తెలుసో వివరాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఆరాతీస్తున్నారు. అధికార పార్టీకి ధీటుగా ఆయా నియోజకవర్గాలలో ప్రతిపక్ష పార్టీ నేతలు ఎవరు ఉన్నారో వివరాలు తీసుకుంటున్నారు. వారు గతంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీగా ఉన్నారా వంటి వివరాలు సేకరిస్తున్నారు. పార్టీ నేతలైతే ఎంత ప్రభావం. ఆయా మండలాల నియోజకవర్గాలలో కలిగి ఉన్నారో తెలుసుకుంటున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులతో పాటు నేతలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలలో బాగా ప్రభావం ఉన్న నేతలు ఎంత మంది ఉన్నారో వారి వివరాలు తీసుకుంటు న్నారు. ఒక బృందంగా కాకుండా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి జనం ఉండే ప్రాంతాలకు వెళ్లి ఈ వివరాలను సేకరిస్తున్నారు. ఎక్కువగా ఆయా గ్రామాల పరిధిలోని బస్టాండ్ అడ్డాలు, టీస్టాండ్‌లు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఈ వివరాలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వారు ఆసక్తిగా వివరాలు చెపుతున్నా మరికొన్ని గ్రామాల్లో ముక్తసరిగా సమాధానాలు ఇస్తున్నట్లు తెలుస్తుంది. సర్వే చేసేవారు మాత్రం ఓపికగా ఈ వివరాలను తీసుకుంటున్నట్లు సమాచారం. వారికి కావాల్సినవి వచ్చిన తర్వాత మాట్లాడిన వారి ఫోన్ నెంబర్లు కూడా తీసుకుంటున్నారు. ఈ సర్వే ఏ సంస్థదో తెలవకున్నా వచ్చే ఎన్నికల కోసమే ఇది జరుగుతున్నట్లు తెలుస్తుంది. దాదాపు పది అంశాలపై సేకరిస్తున్నాడటంతో ఎన్నికల కోసమేనని పలువురు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికలు అధికార పార్టీతో పాటు అన్ని పార్టీలకు కీలకం కానుండటంతో ఈ వివరాలు సేకరిస్తున్నట్లు పలువురు నేతలు అనుమానిస్తున్నారు. ఈ సర్వేలతో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు మాత్రం మరింత పనిచేసే విధంగా ఉపయోగపడనుంది.

తెలంగాణ సస్యశ్యామలం కోసమే..

కాళేశ్వరం పథకం

● రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం : జిల్లా ఎంపీ కవిత



నందిపేటలో స్త్రీశక్తి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కవిత

నందిపేట: తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికే ప్రభుత్వం కాళేశ్వరం పథకాన్ని చేపట్టిందని నిజామాబాద్ ఎంపీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం మండలంలో వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ బంగారు తెలంగాణ సాధన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతోనే సాధ్యమని అన్నారు. 60 యేళ్ళ పాలనలో ఎవరూ చేపట్టని సంక్షేమ, అభివృద్ధి పథకాలను కేసీఆర్ చేపడుతున్నారని తెలిపారు. అందులో భాగమే శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం అని కవిత చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అభివృద్ధి తెలంగాణలోనే జరుగుతుందని, అందుకు కేసీఆర్ 18 నుంచి 20 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. అందులో అధికారులను సైతం భాగస్వాములుగా చేశారని చెప్పారు. పునరుజ్జీవ పథకం పనులు పూర్తయితే నిజామాబాద్ జిల్లాలో లక్షా 25వేల ఎకరాలకు రెండు పంటలకు పుష్కలంగా సాగు నీరు అందుతుందని చెప్పారు. కుల వృత్తులే ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తుందని అందుకే గొల్ల కుర్మలకు 75 శాతం సబ్సిడీపై గొర్రెల పంపిణీ చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు లబ్ధిదారులకు 14 లక్షల యూనిట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువులను పునరుద్ధరించి 45వేల చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో గంగాపుత్రులకు 4వేల కోట్ల సంపద చేకూరుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలలో ప్రసవం జరిగితే రూ.12 వేలు, ఆడ పిల్ల జన్మిస్తే రూ.వెయ్యి అదనం రూ.3వేలు విలువ చేసే కేసీఆర్ కిట్ అందిస్తున్నట్లు కవిత వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.400 కోట్లతో ఆరోగ్య లక్ష్మీ, హాస్టల్ వసతితో డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద'ని తెలిపారు. గర్భిణులను ఆస్పత్రులకు తీసుకువెళ్ళేందుకు 102ను రూపొందిస్తున్నట్లు ఎంపీ కవిత వెల్లడించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి కలెక్టర్ రవీందర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీపీ యమున, జెడ్పీటీసీ సభ్యురాలు డాంగే స్వాతి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కల భూమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మెన్లు పాల్గొన్నారు.

జడ్పీకి నిధులు మంజూరు చేయాలని..

పంచాయతీరాజ్ శాఖ మంత్రికి వినతి




మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జడ్పీ చైర్మన్, సభ్యులు

వీఆర్వో: గ్రామంలో రెండు రేషన్ దుకాలున్నాయి. వాటి ద్వారా సరుకులను సక్రమంగా పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి:రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయా ?

వీఆర్వో: రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసు కుంటున్నాం. డీలర్లు అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి : గ్రామంలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి. ?

వీఆర్వో:గ్రామంలో 958 రేషన్ కార్డులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి:రేషన్ కార్డులు లేనివారికి కొత్తగా ఎప్పుడు అందజేస్తారు ?

వీఆర్వో: కొత్తరేషన్ కార్డులు ఇప్పుడు అయితే లేవు. పై అధికారులు తెలుపుతే ప్రజలకు తెలుపుతాం.

ఆంధ్రజ్యోతి: రేషన్‌డీలర్లు సమయ పాలన పాటిస్తున్నారా?

వీఆర్వో: రేషన్‌డీలర్లు సమయ పాలన పాటించకపోయినట్లైతే వారి కఠిన చర్యలు తీసుకుంటాము.

ఆంధ్రజ్యోతి: రేషన్‌డీలర్లు సమస్యల పరిష్కరానికోసం పాల్గొన్న డీలర్ల ద్వారా వినియోగదారులకు నష్టం వాటిల్ల కుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

వీఆర్వో: రేషన్‌డీలర్లు సమస్యలను అధికారుల,ప్రభుత్వ ఆదేశాలప్రకారం చర్యలు తీసుకుంటాం.

- మెండోర

లెన్స్ స్టోరీ

మిషన్ పైపులతో ఇబ్బందులు



మెండోర:మండల కేంద్రంలో కొట్టాల సందులో మిషన్ భగీరథ పైపులైన్ కోసం వేసిన పైపులు ఇరుకైనా రోడ్డులో ముందు పైకి తేలి ఉండడంతో ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. ఇంటి ముందు గేటుముందు ఉండటంతో ప్రజలు రాత్రి పూట పైపులైన్ ఏర్పడక కింద పడుతున్నారు. ఇరుకైన రోడ్డులో ఇలా పైపులైన్ పైకి తేలడంతో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి పైపులను పూడ్చి వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నరకప్రాయంగా మండల రోడ్లు



బుస్సాపూర్ వద్ద మండల కేంద్రానికి చేరుకొనే రోడ్డు ఇలా..



ఇదీ పోచంపాడ్ ఆలయాలకు వెళ్లే దారి..

మెండోర: మండలంలో బుస్సాపూర్ గ్రామ బస్టాండ్ వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయమై వడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుస్సాపూర్ నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే మొదట దర్శనం ఇచ్చే రోడ్డు గుంతల రోడ్డు . దీంతో ఈ దారిగుండా మండల కేంద్రానికి రావడానికి అధికారులు, ఉద్యోగులు, ప్రయాణికులు జంకుతున్నారు. కొత్తగా మండల కేంద్రం ఏర్పడిన గాని రోడ్డు ఇలా ఉన్నాయి అని ప్రజలు ముక్కునా వెలుసుకుంటున్నారు. బుస్సాపూర్ నుంచి మండల కేంద్రానికి చేరుకోవడానికి 4 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కానీ గుంతల రోడ్డు దర్శనం కావడంతో పోచంపాడ్, చాకిర్యాల్ ఎక్స్ రోడ్డు కోడిచర్ల మీదుగా మండల కేంద్రానికి రాజకీయనాయకులు, అధికారులు, ఉద్యోగులు 10 కిలో మీటర్ల దూరం అయినా ఫర్వాలేదు కానీ మంచిగా ఉన్న రోడ్డు మీదనుంచి వస్తున్నాం అని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. పోచంపాడ్ పుణ్యక్షేత్ర శివాలయం, రామాలయం వెళ్లే దారులు కూడా పూర్తిగా గుంతలు కావడంతో భక్తులు దర్శనానికి రావడానికి జంకుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతల మయమైన రోడ్డును బాగు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం..



గ్రామీణ రోడ్డు పూర్తిగా గుంతలు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మండల కేంద్రం నుండి జాతీయ రహదారి వెళ్లే రోడ్డు అక్కడక్కడా గుంతలు కావడంతో రోడ్డు మీదా ప్రయాణం సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి బాగుచేయాలి.

- తలారి గంగాధర్, మెండోర

అధికారులు స్పందించి బాగు చేయాలి..



మెండోర మండల కేంద్రం నుంచి ముప్కాల్ బైపాస్ రోడ్డు వరకు వేసిన రోడ్డు నెల రోజులు కూడా గడవకముందే రోడ్డు పూర్తిగా దెబ్బతింది.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు నాణ్యత లోపం వల్ల పూర్తిగా రోడ్డు చెడిపోయింది. దీంతో ప్రభుత్వానికి గండిపడుతున్నది. నిర్లక్ష్యంగా వేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని రోడ్డు బాగుచేయాలి.

- కొప్పెలా భూమయ్య, మెండోర

అధికారుల చొరవతో కులబహిష్కరణ ఎత్తివేత

మోర్తాడ్: అధికారులు చొరవ తీసుకోవడంతో కులబహిష్కరణ వివాదం తొలగిపోయింది. మండలంలోని గాండ్లపేట్ గ్రామానికి చెందిన మామిడిగంగు తమ కుటుంబానికి మాలకుల పెద్దలు కులబహిష్కరణ చేశారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో యిరువర్గాలతో తహసీల్దార్ సూర్యప్రకాశ్ , ఎస్సై అశోక్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. అనంతరం భార్యభర్తల పంచాయితీలో భార్యకు విధించిన 80 వేల జరిమానాను రద్దు చేస్తూ, కుల బహిష్కరణ కూడా ఎత్తి వేస్తున్నామని కుల పెద్దలు పేర్కొన్నారు. గ్రామాలలో జరిమానాలు, బహిష్కరాలు విధించడం చట్ట రీత్యా కారణమని, ఇందుకు శిక్షలు కఠినంగా ఉంటాయని అధికారులు అన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించినందుకు సంతోషంగా వుందని, గ్రామస్థులు అన్నారు.



కులపెద్దలతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ సూర్యప్రకాశ్

సాంకేతిక విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులకు సెమినార్

బాల్కొండ: సాంకేతిక విజ్ఞాన శాస్త్రం పాత్ర, స్వచ్ఛ భారత్ సవాళ్లపై బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల విద్యార్థులకు మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. బాల్కొండ మండలంలో వై. తేజశ్రీ కస్తూర్బా (ప్రథమ), జి.హాసిని (ద్వితీయ)ఆదర్శ పాఠశాల, కె. సృజన(తృతీయ)ఉన్నత పాఠశాల బాల్కొండ, ముప్కాల్ మండలం ఎస్. పూజ (ప్రథమ) , టి. శ్రేనిక(ద్వితీయ)ముప్కాల్ ఉన్నత పాఠశాల, మెండోరా మండలంలో ఎస్.ఆదిత్య(ప్రథమ) టీఎస్ఆర్‌డబ్ల్యూఎస్ పోచంపాడ్, టి. ప్రియాంక(ద్వితీయ), కె. సౌమ్య (తృతీయ)ఉన్నత పాఠశాల పోచంపాడ్‌ను అభినందించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దేవానందం, వివిధ మండల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, న్యాయ నిర్ణేతలు వి. నరేష్, డి. లక్ష్మణ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్, కొత్తపల్లి, వెంచిర్యాల్ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డి మంగళవారం అందజేశారు. నాగంపేట్‌కు చెందిన రుక్మకు రూ. 60 వేలు, ఎన్. కొత్తపల్లి రాజగంగు రూ. 75 వేలు, వెంచిర్యాల్ లక్ష్మికి రూ. 60 వేలు మంజూరు కాగా ముప్కాల్ మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు లహరి మహేష్, రాజవ్వ రాజేశ్వర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన పెద్ది నిఖితకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మంగళవారం గ్రామ సర్పంచ్ బోడ జమునదేవేందర్ బాధిత కుంటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఎండి సలీం, టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏనుగు గంగారెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు , టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హసాకొత్తూర్‌లో: గ్రామానికి చెందిన యామాపుర రాజశేఖర్‌కు 23 వేలు, ఏనుగు రాములుకు 28 వేలు, కమ్మర్‌పల్లికి చెందిన పుప్పాల సౌజన్యకు 65 వేల రూపాయలు మంజూరు కాగా మంగళవారం పంపిణిచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, ఎంపిటీసీలు తెడ్డు రాజన్న, హారిక, ఉప సర్పంచ్ మూగల రాము, టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కుప్కల్‌లో గొర్రెల పంపిణీ

భీమ్‌గల్:భీమ్‌గల్ మండలంలోని కుప్కల్ గ్రామంలో మంగళవారం ఆ గ్రామానికి చెందిన గొల్లకుర్మ యాదవులకు మంజూరైన గొర్రెలను తహసీల్దార్ బావయ్య, ఎంపీడీవో లింగయ్య నాయకులు అందజేశారు. ప్రభుత్వం గొల్లకుర్మ యాదవులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పెంపకం దారులు సద్వినియోగ పర్చుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు గుణవీర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ రవీందర్, సర్పంచ్ నవ్య మధు, సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు చౌట్‌పల్లి రవి, రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దొన్కంటి నర్సయ్య, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని అమీర్‌నగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన గొర్రెల యూనిట్లను మంగళవారం ఎంపీపీ మలావత్ కౌసల్య గ్రామ సర్పంచ్ వర్నం గంగూబాయి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జిల్లా మల్లేష్‌యాదవ్, టీఆర్ఎస్ నాయకులుగ్రామస్థులు పాల్గొన్నారు.

వేల్పూర్: కుర్మయాదవ్‌లకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమంలో కుకునూర్ గ్రామంలో మంగళవారం కుర్మయాదవులకు గొర్రెలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 21 చొప్పున 336 గొర్రెలను సర్పంచ్ బోజపల్లి రాజ్యలక్ష్మీ సురేష్ , ఎంపీటీసీ మెరుగు నాగమణి శ్రీనివాస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గొర్రెమేకల సహకార సంఘం సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కుకునూర్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఆంధ్రజ్యోతి

17 6

బాల్కొండ

నిజామాబాద్ । బుధవారం 30 ఆగస్టు 2017

బాల్కొండ । కమ్మర్‌పల్లి । వేల్పూర్ । మోర్తాడ్ । భీమ్‌గల్ । మెండోర । ముప్కాల్ । ఏర్గట్ల

హలో..హలో..

వేల్పూర్ మండల అధికారుల ఫోన్ నెంబర్లు

ఎంపీడీవో	7095510983	ఏపీఎం	8790990142	మం.పశువైద్యాధికారి	9603625163
తహసీల్దార్	9491036905	పీహెచ్‌సీ డాక్టర్	9440795469	ఈజీఎస్‌ఏపీవో	7095510130
ఈవోపీఆర్డీ	9347356708	ఎంఈవో	8341146834	ట్రాన్స్‌కో ఈవో	9440811636
ఎస్సై	9440795469	ఐకేపీ ఏపీఎం	8790990142	ఆర్‌డబ్ల్యూఎస్ ఈవో	8885553302
వ్యవసాయాధికారి	7288894585	ఇరిగేషన్ ఏవో	9701367502		

పీఆర్టీయూ జిల్లా నాయకులకు సన్మానం



వేల్పూర్‌లో పీఆర్టీయూ జిల్లా నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్ : మండలానికి చెందిన జిల్లా పీఆర్టీయూ నాయకులు కృష్ణరెడ్డి, నర్సింహ రావులను మంగళవారం మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు.వేల్పూర్ మండల విద్యావనరుల కార్యాలయంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్ అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు.ఈసమావేశానికి జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజన్నలు హాజరై మాట్లాడారు. పెప్టెంబర్ 1న నిర్వహించ తల పెట్టిన సీపీఎస్ మాస్ కాజువల్ లీవ్‌కు తెలంగాణ రాష్ట్ర పీఆర్టీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లింగమూర్తి,పీఆర్టీయూ నాయకులు ప్రశాంత్‌రెడ్డి , సురేష్, సుభాషణి, గంగారెడ్డి, కాంతయ్య, నిజామాబాద్ రూరల్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు

మెండోర: ఉత్తర తెలంగాణ జిల్లా వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు స్వల్పంగా వస్తుందని ప్రాజెక్టు డీఈ జగదీష్ మంగళవారం తెలిపారు. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 16.642 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని డీఈ తెలిపారు. గణేష్ నిమజ్జనాల కోరకు కాకతీయ కాలువకు 1000 క్యూసెక్కులు నీటి విడుదల చేస్తున్నట్లు డిఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగుల (29.934 టీఎంసిలు) నీటి నిల్వ ఉందని గత ఏడాది ఇదే సమయానికి 1073.40 (36.103 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 21.460 టీఎంసీలు వచ్చిందని డీఈ జగదీష్ తెలిపారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ గుంతలో బోల్తా పడిన జేసీబీ

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల్లో భాగంగా మంగళవారం ప్రమాదవశాత్తు జెసిబి బోల్తాపడింది. పైప్‌లైన్ తీసి, మట్టిని పూడ్చేక్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఇతర యంత్రాల సహాయంతో జేసీబీని బయటికి తీశారు.



బాల్కొండలో బోల్తాపడ్డ జేసీబీ

‘అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయరా? ’

వేల్పూర్ : ప్రభుత్వం ద్వారా అర్హులైనా వారికి పింఛన్లు మంజూరు రాకపోవడం పట్ల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ,అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ రజిత బాల్‌రాజ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ గ్రామంలో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు కోసం నెలల తరబడి దరఖాస్తులు చేస్తున్నప్పటికీ ఎందుకు మంజూరు కావడం లేదని పచ్చల నడ్కుడ, వాడి , జాన్కంపేట్ ఎంపీటీసీలు రవి, గోలీఆనంద్, సత్యనందం, అమినాపూర్ సర్పంచ్ రాజాగౌడ్ లు అధికారులను నిలదీస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజూ రైన పింఛన్ల డబ్బుల పంపిణీలో కూడా చాలా లోపాలు ఉన్నాయని వాటిని ఎందుకు సరిచేయడం లేదని సర్పంచ్ రాజగౌడ్, ఏవోపీఆర్డీ భీంరావును నిలదీశారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు కోసం ఎప్పటికప్పుడు అప్రోల్ చేస్తున్నామని, మంజూరు చేయడంలో మాత్రం పూర్తి బాధ్యత డీఆర్డీఏ పీడీపై ఉంటుందని ఈ విషయాన్ని సభ్యులు గమనించాలని ఈవోపీఆర్డీ సూచించారు. పింఛన్ కోసం గ్రామ సభ ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేసే పూర్తి బాధ్యత గ్రామ కార్యదర్శి అప్పజెప్పుతున్నమని, పింఛన్ డబ్బుల పంపిణీలో జరుగుతున్న లోపాలను త్వరలోనే సరి చేస్తామని ఎంపీడీవో రాజ్‌వీర్ సభ్యులకు సూచిం చారు. మూడు నెలల కొసారి నిర్వహించే మండల సభకు గ్రామ కార్యదర్శులు, కొన్ని శాఖల అధికారులు ఎందుకు హజరు కావడం లేదని ఎంపీపీ రజిత , పడిగెల ఎంపీటీసీ హన్మంత్‌రావులు ఎంపీడీవో ను ప్రశ్నించారు. మండల సభపై ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. ఇక ముందు అందరు సకాలంలో హాజరు అయ్యేలా చూస్తామని ఎంపీడీవో వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేగుల్ల రాములు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరయ్యారు.



పింఛన్ల మంజూరు రాకపోవడంపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

‘సర్వీస్ రూల్స్‌లో భాషా పండితులకు న్యాయం చేయాలి’



పాలెంలో పోస్టకార్డుల ఉద్యమంలో పాల్గొన్న భాషా పండితులు

మోర్తాడ్ : ప్రభుత్వం రూపొందిస్తున్న సర్వీస్ రూల్స్‌లో బాషా పండితులకు న్యాయం కలిగేలా చూడాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి కరీముల్లా, కెవి. రమణాచారి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రికి పోస్టకార్డుల పంపిణీ ఉద్యమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన 17, 18 జీవోలను వెంటనే అమలు చేయాలని కోరారు. సర్వీస్ రూల్స్‌లో భాషా పండితులకు న్యాయం కలిగేలా రూపొందించాలని కోరుతూ జరపుతున్న పోస్టకార్డ్‌ల ఉద్యమాన్ని విజయవంతం చేయాలన్నారు. న్యాయం జరిగే వరకు సీఎంకు పోస్టకార్డులు పంపుతూనే ఉంటామని కరీముల్లా, రమాణాచారి అన్నారు. అంతేకాక సీపీఎం ఉపాధ్యాయులకు కూడా పండిత పరిషత్తు పూర్తి మద్దతు నిస్తున్నామన్నామని అన్నారు. సెప్టెంబర్ 1న జరిగే ధర్నాలో బాషా పండితులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పతాని గంగాధర్,రంగచారి, ప్రవీణ్ శర్మ, శ్యామ్‌చరణ్, సత్యనారాయణ, చిన్నయ్య, పాల్గొన్నారు.

భీమ్‌గల్ : ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎంకి తమ సమస్యలు పరిష్కరం కావాలని కోరుతూ పోస్టుకార్డుల ద్వారా విన్నవించుకున్నట్లు భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెమీల్‌ఉల్లా తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినా ఉత్తర్వుల ను వెంటనే అమలు చేయాలని సీఎంని పోస్టుకార్డు ద్వారా విన్నవించినట్లు తెలిపారు.కార్యక్రమంలో భాషా పండితుల సంఘం నాయకులు రమణాచారి పాటు భాషా పండితులు పాల్గొన్నారు.ఇట్టి పోస్టుకార్డుల కార్యక్రమాన్ని ఈనెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు వీరు తెలిపారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 17, 18 ప్రకారం భాషాపండితులకు పదోన్నతు కల్పించాలి రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమీలుల్ల డిమాండ్ చేశారు. మంగళవారం మండంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యా పండిత్ పరిషత్ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు జీవోను గత ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినప్పటికి అమలుకు నోచుకోలేదన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణచారి, బషీరాబాద్ పిజి హెచ్‌ఎం గంగారాం, ఉపాధ్యాయులు రాణి, కైలాస్, రాంపాల్, మమత, తెలుగు, హిందీ భాషాపండితులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పనులను సందర్శించిన రైతులు



కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద రైతులు

మోర్తాడ్: మండల కేంద్రానికి చెందిన కొందరు యువరైతులు కాళేశ్వరం మేడి గడ్డ రిజర్వాయర్ పనులను మంగళవారం సందర్శించారు. కాళేశ్వరం నీటిని వరద కాలువ ద్వారా రివర్స్ పంపింగ్‌తో శ్రీరామసాగర్ ప్రాజెక్టును నింపడానికి ప్రభుత్వం చేస్తున్న బృహత్తర పథకం వల్ల రైతాంగం ఎంతో లాభం పొందుతారని రైతులు అన్నారు. కాళేశ్వరం నీరు ఎస్సారెస్పీకి చేరుతే సాగునీటి కొరత తీరుతోందని రైతులు అన్నారు. ఈ పథకం రైతులకు వరప్రదాయిని కాగలదని అన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ రిజర్వాయర్ పనులను స్వాగతిస్తున్నామని అన్నారు. సందర్శించిన వారిలో మోర్తాడ్ ఉప సర్పంచ్ జెసి గంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేసీ రాజేశ్వర్, చాపల సుధాకర్, సామజైపాల్, బద్దం గంగారెడ్డి, ఎలాల నారాయణ, బి. అశోక్ ఉన్నారు.

మసీద్ చౌరస్తాలో వృథాగా ఉన్న మినీ వాటర్‌ట్యాంక్

మోర్తాడ్ : మండల కేంద్రంలోని మసీదు చౌరస్తాలో ఉన్న మినీవాటర్ ట్యాంకు గత ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉంది. ఈ ప్రాంతంలో ఎలాంటి నీటి సౌకర్యం లేకపోవడంతో దీన్ని ఏర్పాటు చేశారు. కాగా చౌరస్తాలో ఉన్న ఈ ట్యాంకు వల్ల హోటళ్లు, గల్లీ వాసులకు ఎంతో ఉపయోగపడేది. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న మైనార్టీ వారికి ట్యాంకు ఎంతో ఉపయోగపడేది. హోటళ్ళకు కూడా ట్యాంకు నీటిని వాడుకునే వారు. ఆరు నెలల నుండి ప్రజలకు నీరు అందించని ఈ ట్యాంకు గురించి పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ వారు సిబ్బంది మినిట్యాంకును వినియోగంలోకి తీసుకరావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నిమజ్జనం వరకు నిరంతరం విద్యుత్ ఇవ్వాలని వినతి

భీమ్‌గల్: భీమ్‌గల్ మండల కేంద్రంలో సెప్టెంబర్ 5న వినాయక నిమజ్జనం జరిపే వరకు నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని గ్రామ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ గంగాధర్ , ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా కరెంట్ సరఫరా చేయాలని కోరారు. కరంట్ సరఫరాలో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వినతిప్రతంలో కోరారు.

డీసీసీకి కాంగ్రెస్ బూత్ కమిటీల జాబితా అందజేత

భీమ్‌గల్ : భీమ్‌గల్ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ బూత్ కమిటీల జాబితాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌కు భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో అందజేశారు. మండలంలోని 24 గ్రామాలకు సంబంధించి 50 బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నె సురేందర్ జిల్లా అధ్యక్షుడికి వివరించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం కల్పించే దిశలో కృషి చేస్తున్నామని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన వారిలో కన్నె సురేందర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రహెమన్, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సిబ్బంది ఉన్నారు.

1న సామూహిక సెలవు కోసం వినతి

కమ్మర్‌పల్లి: సీపీఎస్ ఉద్యోగులకు మద్దతుగా రాష్ట్రంలో కంట్రీబ్యూటరీ పెన్షన్స్(సీపీఎస్)కు వ్యతిరేకంగా పాఠశాలలో సెప్టెంబర్ 1న సామూహిక సెలవు తీసుకోవడానికి నిత్చయించినట్లు మండంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోనాధ్యాయుడు కే గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వేల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

కమ్మర్‌పల్లి: మండంలోని హసాకొత్తూర్ గ్రామంలోని ఫ్రెండ్స్ వేల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపంవద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొ న్నారు. యూత్ అధ్యక్షుడు ఎస్ ప్రశాంత్, పెద్ది సురేష్, కే వెంకటేష్, ఏనుగు మనోహర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీభాషిత కళాశాలలో క్రీడా పోటీలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీభాషిత జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడల దినోత్సవం, ధ్యాన్‌చంద్ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల కరస్పాం చైర్మన్ సుకెట్ రవి, డైరెక్టర్‌లు విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కోర పాఠశాలలో విద్యార్థులకు యునిఫాంల అందజేత

వేల్పూర్ : మండలంలోని లక్కోర గ్రామ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంలను మంగళవారం సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, ఎంపీటీసీ నర్సు గంగారాంలు పంపిణీ చేశారు. 6 నుంచి 8వ తరగతులకు చెందిన 39 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లింగ మూర్తి, వీడీసీ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, సర్వసమాజ్ అధ్యక్షుడు అనిల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం, టీచర్లుపాల్గొన్నారు.

‘లక్ష్మీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలి’

వేల్పూర్: ఎస్సారెస్పీ నుంచి లక్ష్మీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వేల్పూర్‌లో టీడీటీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కన్నగారి మోహన్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్సారెస్సీలో 1070 అడుగులకు పైగా నీరు చేరినందున పంటలను కాపాడేందుకు వెంటనే లక్ష్మీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీమాజీ ఉపాధ్యక్షుడు బద్దం రాజరెడ్డి, టీడీపీ నాయకులు నోముల నర్సారెడ్డి, తీగెల సాయిరెడ్డి, యాల్లరమేష్, పాల్గొన్నారు.

గుండె పోటుతో వార్డు సభ్యురాలి మృతి

వేల్పూర్ : మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామ పంచాయితీ వార్డు సభ్యురాలు కుర్మ రాజనర్సు (51) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. దీంతో రాజనర్సును చికిత్స నిమిత్తం ఆటోలో ఆర్మూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతురాలికి భర్త కిషన్, కుమారుడు రాజు ఉన్నారు. రాజనర్సు మృత దేహానికి బుధవారం అంత్య క్రియలు జరిపించనున్నట్లు కుటుంబ సభ్యులు తులిపారు.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబీ
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలినవన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. ఆయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: డి
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబీ
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) పారడే
సమాధానం: సి
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలీ బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2

అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి

వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65

అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి

వయసు: 37 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా

ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18

చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307

వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3

అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1

అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి

వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి

వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34

అర్హత: 10వ తరగతి

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15

అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2

అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9

అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి

వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. **భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?**
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్
2. **భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?**
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి
3. **భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?**
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
4. **భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?**
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి
5. **భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?**
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ
6. **కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?**
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ
7. **భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?**
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ
8. **రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?**
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ
9. **రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?**
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా
10. **రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?**
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ
11. **భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?**
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్
12. **రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?**
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
13. **రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?**
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు
14. **రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?**
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి
15. **రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?**
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
16. **షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?**
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి
17. **పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?**
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు
18. **రాష్ట్రపతి పదవీకాలం?**
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు
19. **రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?**
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. **రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?**
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ
21. **లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?**
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు
22. **రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?**
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ
23. **1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?**
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
24. **రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?**
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ
25. **రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?**
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత
26. **రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?**
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
27. **రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?**
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం
28. **మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?**
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా
29. **రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?**
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ
30. **ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?**
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్
5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4
31. **ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?**
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ
32. **80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ఠ సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?**
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది
33. **ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?**
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు
34. **భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?**
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ
35. **తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?**
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్
36. **భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?**
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ
37. **భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?**
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్
38. **భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?**
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ
39. **ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?**
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి
40. **భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?**
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్
41. **సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?**
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి
42. **ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?**
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్
43. **రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?**
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్
44. **ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?**
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17
45. **రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?**
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
46. **ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?**
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా
47. **జాకీర్ హుస్సేన్ మరణాంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?**
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా
48. **రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?**
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు
49. **ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?**
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
50. **భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?**
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

		15) ఎ	24) ఎ	33) సి	42) బి
		16) బి	25) సి	34) ఎ	43) సి
1) సి	8) బి	17) సి	26) బి	35) డి	44) బి
2) ఎ	9) సి	18) బి	27) ఎ	36) సి	45) డి
3) ఎ	10) బి	19) సి	28) డి	37) బి	46) ఎ
4) డి	11) ఎ	20) డి	29) డి	38) ఎ	47) బి
5) ఎ	12) సి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
6) సి	13) సి	22) సి	31) సి	40) డి	49) ఎ
7) బి	14) డి	23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.
పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ
టెస్ట్ పేపర్స్ - కోడ్స్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)
అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11
ఫలితాల విడుదల: 2018 మార్చి 20
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10
వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్‌ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16
వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

నేటి విద్యార్థులే బావిభారత పౌరులు

● నవభారత సమాజాన్ని నిర్మిద్దాం : ఆర్డీవో వినోద్‌కుమార్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీవో, కమాండెంట్

డిచ్‌పల్లి: నేటి విద్యార్థులే బావిభారత పౌరులని, చక్కగా చదువుకుని నవతరానికి స్ఫూర్తిగా నిలవాలని ఆర్డీవో వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన నేషనల్ యంగ్ లీడర్స్ ప్రొగ్రాంలో భాగంగా డిచ్‌పల్లి కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని కమాండెంట్ సాంబయ్య ప్రారంభించగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా చదివి బావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. ఉగ్రవాద శక్తులను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, కుల, మతాలను విడనాడాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా యువత తగు ప్రోత్సాహాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ బాటలో విద్యార్థులు నడచుకోవాలని సూచించారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు కేంద్రప్రభుత్వం వృత్తిశిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేస్తుందని పేర్కొన్నారు. ప్రతీఒక్కరు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో యువజన సంఘాలను ఏర్పాటుచేసుకుని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య మాట్లాడుతూ, కేంద్ర యువజన వ్యవహారాలు, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ యంగ్ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువత ఎంతో స్ఫూర్తిని పొందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా అతిథులు సన్మానించారు. జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ ఏడో బెటాలియన్ వరకు సాగింది.ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ హరిబాబు, అసిస్టెంట్ కమాండెంట్లు ప్రసన్నకుమార్, రాథోడ్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ రాంచందర్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సురేందర్, జడ్పీటీసీ కూరపాటి అరుణ, సర్పంచ్ అంజయ్య, బెటాలియన్ ఇన్స్‌పెక్టర్లు సంజీవ్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అబుదాబిలో 40 మందికి జరిమానా

ఆర్మూర్: అబుదాబిలో ఇరుకు గదుల్లో నివసిస్తున్న నలభైమంది తెలుగువారికి అక్కడి ప్రభుత్వం భారీగా జరిమానా విధించింది. వేతనాలు తక్కువగా ఉండడంతో ఒకే గదిలో పది నుంచి ఇరవై మంది నివసిస్తున్నారు. ఎమిరేట్స్ రెసిడెన్షియల్ నియమావళి-2011 చట్టం సంఖ్య-1 ప్రకారం అబుదాబిలో ఒక గదిలో ముగ్గురి కంటే ఎక్కువ నివాసం ఉండరాదు. అపార్ట్‌మెంట్, విల్లాల్లో ఒకే కుటుంబం ఉండాలి. వంట గదులు, కారిడార్, సాధారణ ప్రాంతంలో నిద్రించరాదు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తోంది.

నగర శివారులో మొరం తవ్వకాలు

● పట్టించుకోని అధికార యంత్రాంగం

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

నగరంలో మొరం అమ్మకాలన్నీ అధికార పార్టీకి చెందిన నేతల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయి. మొరం అమ్మకాల్లో వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. తమ మాట వినని అధికారులను వారు బెదిరిస్తున్నారు. నగర శివారులోని గుట్టలు, ప్రభుత్వ భూముల్లో వీరు తవ్వకాలు జరిపి, నగరంలో అమ్మకాలు సాగిస్తున్నారు. తాము నిర్ణయించిన ధరకే వీరు మొరాన్ని సరఫరా చేస్తున్నారు. వారిమాట వినకుండా ఎవరైనా మొరం సరఫరా చేస్తే, వారి వాహనాలను పోలీస్ స్టేషన్లలో పెట్టిస్తున్నారు. పెద్ద వాహనాల ద్వారా జరుగుతున్న సరఫరాను పట్టించుకోని అధికారులు చిన్న వాహనాలపై మాత్రం దబాయిస్తూ, వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో ఇళ్లు కట్టుకునే వారికి మొరం భారాన్ని పెంచుతున్నారు. నగరాన్ని ఆనుకునివున్న నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్‌పల్లి, మాక్లూర్, ఎడపల్లి మండలాల పరిధిలో ఈ మొరం రవాణా యథేచ్ఛగా సాగుతుంది. గత కొన్నేళ్లుగా తవ్వకాలు జరుగుతున్నాయి. నగరం అభివృద్ధి చెందిన మాదిరిగానే తవ్వకాలు జరుపుతూ అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూమిలో తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరుచేసేవారు. గ్రీన్ ట్రిబ్యునల్‌తోపాటు కోర్టులు ఆదేశించడంతో ఇటువంటి తవ్వకాలకు అనుమతి ఇవ్వడం లేదు. ప్రభుత్వ అవసరాల కోసం మాత్రమే అనుమతులు మంజూరుచేస్తున్నారు. రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రాజెక్టుల కోసం మాత్రమే అనుమతిలిస్తున్నారు. వీటికి తప్పా, ఇతర అవసరాలకు దేనికీ అనుమతులు మంజూరుచేయడంలేదు. ప్రైవేటు వ్యక్తులకు కొన్నిచోట్లనే అనుమతి ఇచ్చారు. దీనిని ఆసరాగా చేసుకుని నగరంలో ఇళ్లు నిర్మించుకునేవారికి లారీకి రెండువేల నుంచి మూడువేల రూపాయల వరకు మొరం అమ్మకాలు చేస్తున్నారు. నగరం చుట్టూ ఉన్న గ్రామాల్లో గుట్టలు పరిశీలిస్తే ఈ మొరం తవ్వకాల బాగోతం బయటపడుతుంది. గతంలో రైల్వేలైన్లకు అనుమతి లేకుండా చెరువులు, గుట్టలు తవ్వకాలు జరుపగా, సదరు కాంట్రాక్టర్‌పై చర్యకు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. మొరం కోసం సుమారు 18 కోట్ల రూపాయలు వరకు చెల్లింపులు చేయాలని పేర్కొంది. ఇతర ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేపట్టవద్దని కోరింది. అయితే అటవీ భూములతోపాటు ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వకాలు జరుగుతున్నా, ఆయా శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ఆ వైపు పోవడం లేదు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని వారు దూరంగా ఉంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే తప్పా, తనిఖీలు చేపట్టడం, అక్రమంగా రవాణా చేసే వాహనాలను పట్టుకోవడం లేదు. ఈ మొరం అమ్మకాలన్నీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతుండటంతో అడ్డుకునేందుకు అధికారులు సైతం జంకుతూ, దూరంగా ఉంటున్నారు. ఎవరైనా ట్రాక్టర్లు, లారీల ద్వారా నగరానికి సరఫరా చేస్తే మాత్రం వారి వాహనాలను సంబంధిత అధికారులకు తెలియజేసి సీజ్ చేయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారికి ఆ అధికారులు సంబంధిత నేతలతో కలిసి రావాలని కోరుతున్నారు. నగరంలోని ఒక నేత ఈ మొరం అమ్మకాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మొరం అక్రమ తవ్వకాలు ఎక్కడ జరుగుతున్నాయో రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత వ్యక్తులపై ఎటువంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఎవరైనా ఒకటో, రెండో వాహనాలు సీజ్ చేస్తే వెంటనే ఫోన్‌లు వస్తుండటంతో తమకెందుకులే అని వాటిని వదిలివేస్తున్నారు. వర్షాల సమయంలో మినహా మిగతా సమయంలో ఇవి నడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దందాలో పెద్దవారున్నందున తామేమీ చేయలేని పరిస్థితిలోనున్నామని కొంతమంది అధికారులు తెలిపారు. తమ పేర్లు రాయవద్దని కోరారు. జిల్లా యంత్రాంగం ఈ మొరం అక్రమ రవాణాపై దృష్టి సారిస్తే, అక్రమ రవాణా అదుపులోకి రావడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది.

వన్నెల్(బీ)లో కదులుతున్న గణనాథుడు!

● తండోపతండాలుగా జనాలు



కదులుతున్న గణపతి వద్ద బారులు తీరిన భక్తులు

బాల్కొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన గణనాథుడు మంగళవారం కదులుతూ పలువురిని ఆశ్చర్యపరచిన సంఘటన బాల్కొండ మండలం వన్నెల్ (బీ)లో చోటుచేసుకుంది. గ్రామంలోని విఘ్నేశ్వర యూత్ నిర్వాహకులు నెలకొల్పిన ఆరడుగుల గణపతి పక్కలకు కదులుతూ ఉండడాన్ని గమనించిన యువకులు గ్రామస్థులకు సమాచారం అందించారు. ఆ నోటా, ఈ నోటా ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేశారు. మొదట కదలడం లేదని భావించిన గ్రామస్థులు తర్వాత రెండు నిమిషాలకు కొన్ని సెకన్లపాటు కదులుతూ కనిపించడంతో విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి మహిమగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంఘటనను తిలకించేందుకు బాల్కొండతోపాటు ముప్కాల్, మెండోరా మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇదిలావుండగా, గణపతి కదిలితే అరిష్టమని శాంతి జరిపించాలని కొందరు పేర్కొనడం గమనార్హం.

బంజార కీర్తి పురస్కారం అందుకున్న కార్పొరేటర్ చాంగుబాయి

ఇందూరు: బంజార సంస్కృతిని చాటి చెపుతూ తీజ్ పండుగను, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించినందుకు 50వ డివిజన్ కార్పొరేటర్ చాంగుబాయికి బంజార కీర్తి పురస్కారం వరించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన బంజారా మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామన్ మేగాసేసే అవార్డు గ్రహీత రాజేందర్ కార్పొరేటర్ చాంగుబాయి బంజారకీర్తి పురస్కారం అందజేసి శాలువాతో సన్మానించారు. ఎంపీ సీతారాం నాయక్, ఆర్‌టీఏ కమిషనర్ మాన్‌సింగ్, జీహెచ్ఎంసీ ఎస్ఈ పాండురంగరావ్ నాయక్, ఇన్ కంటాక్స్ కమిషనర్ డాక్టర్ రాంసింగ్, ప్రకాష్ రాథోడ్ పాల్గొన్నారు.

ముంబైలో ఎమ్మెల్సీ ఆకుల లలితకు సన్మానం



ఆకుల లలిత దంపతులను సన్మానిస్తున్న పోతు రాజారాం, తదితరులు

నిజామాబాద్ అర్బన్: లాల్‌బాగ్ వినాయకుడిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ముంబై వెళ్లిన ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులను మంగళవారం ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ముంబై మహా నగరంలో తెలుగు వాళ్లు ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఉండడం గొప్ప విషయమన్నారు. మాజీ అధ్యక్షుడు పోతు రాజారాం నిజామాబాద్ జిల్లావాసి అవడం జిల్లాకే గర్వకారణమన్నారు. తెలంగాణ ప్రజలంతా ముంబైలో కలిసి మెలిసి ఉండి ఒకరినొకరు సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు ఏక్‌నాథ్, మాజీ జడ్పీటీసీ సూర్యసురేశ్, ఆంధ్రమహాసభ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ప్రమాణస్వీకారం'



మాట్లాడుతున్న చాంబర్‌ఆఫ్‌కామర్స్ ప్రతినిధులు

ఖిల్లా: చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేయనున్నారని నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షుడు శ్యాంసుందర్‌అగర్వాల్ తెలిపారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గత 20ఏళ్ల క్రితం ఏర్పడిందన్నారు. అనేక స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ఆహ్వానిస్తామన్నారు. బుధవారం జరిగే ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథులుగా హాజరువుతున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్సీలు రాజేశ్వర్, వీజీ.గౌడ్, ఆకుల లలిత, డాక్టర్ ఆర్.భూపత్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాలగణేష్‌గుప్త, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డిగోవర్ధన్, మేయర్ ఆకులసుజాతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి రాజ్‌కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షులు వెంకట్‌నర్సగౌడ్, గంగాధర్‌రావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిజామాబాద్ అర్బన్ : కొటగల్లి బాలికల హైస్కూల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ కొటగల్లి బాలికల పాఠశాల అనేక సమస్యలతో సతమతమవుతుందని తెలిపారు. చినుకు పడితే చాలు పాఠశాల చెరువులా మారుతుందన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలో నెలకొన్న సమస్యల పట్ల ఇటు ప్రభుత్వం అటు విద్యాశాఖ దృష్టిపెట్టకపోవడం దారుణమన్నారు. పాఠశాలకు ప్రహరి లేక ఆకతాయిలకు అడ్డాగా మారిందని పాఠశాల సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మహేష్, విఘ్నేష్, సందిప్, వంశి, మధు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడబిడ్డలను గౌరవించడానికే సంక్షేమ పథకాలు

● అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇందూరు : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలను గౌరవించకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తనవంతుగా లబ్ధిదారులకు చెక్కులతో పాటు చీరను అర్బన్ ఎమ్మెల్యే కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలో ఆడపిల్లల పెళ్లి ఖర్చుల భారం తగ్గించడానికి కల్యాణలక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అర్హులైన 216 మంది లబ్ధిదారులకు ఒక్కోక్కరికి 51వేల రూపాయల చెక్కును అందజేయబడుతుందన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు పెరిగినందున 75.116 రూపాయలకు పెంచి ఇవ్వనున్నామన్నారు. మొదట పథకం ప్రారంభించడానికి కేవలం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మాత్రమే వర్తింప చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి బీసీలకు, తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి నిరుపేద కుటుంబంలో ఆడపిల్లల పెళ్లి ఖర్చులకు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం బతుకమ్మ పండుగకు ప్రతి తెల్లరేషన్‌కార్డు ఉన్న వారిలో 18ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు ఒక్కో చీర రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18, 19, 20 తేదీలలో చీరలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆకుల సుజాత, కార్పొరేటర్‌లు లక్ష్మి, చంద్రకళ, సువర్ణ, గంగామణి, పోతుల పురుషోత్తం, పంచరెడ్డి సురేశ్, టీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్, పంచరెడ్డిసూరి విజయ పాల్గొన్నారు.

మైనార్టీలకు షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. మంగళవారం నగరంలోని కింగ్స్ ఫంక్షన్‌హాల్‌లో షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త ముఖ్య అతిథిగా విచ్చేసి మైనార్టీలకు షాదీముబారక్ చెక్కులను తనవంతు కానుకగా ఎమ్మెల్యే స్వంత ఖర్చులతో చీరను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద మైనార్టీ కుటుంబాల ఆడబిడ్డలకు పెళ్లి ఖర్చుల నిమిత్తం 51వేలు సీఎం కేసీఆర్ అందజేస్తున్నారు. తన బాధ్యతగా ప్రతి ఒక్క లబ్దిదారులకు చెక్కుతో పాటు చీరను అందజేస్తున్నమన్నారు. అనంతరం మజిద్ కమిటీలకు 50లక్షలు, లబ్దిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశారు. నగరమేయర్ ఆకుల సుజాత, డిప్యూటి మేయర్ ఫహీం, కార్పొరేటర్‌లు ఖుద్దుస్, షకిల్, టీఆర్ఎస్ నాయకులు సుజిత్ ఠాకూర్, యాసిన్‌సాబ్రి, నవిద్‌ఎక్బాల్, ముజాయిద్ అలీబబ్బు పాల్గొన్నారు.

'ఆధునిక పద్ధతిలో కిడ్నీ రోగులకు ఊరట'

పెద్దబజార్ : కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్న వారికి ఆధునిక పద్ధతిలో కిడ్నీ రాళ్లను తొలగిస్తూ ఊరట కల్పించడమే ప్రధాన లక్ష్మమని కిడ్ని లేజర్ సర్జన్ వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం నగరంలోని శ్రీకృష్ణ న్యూగోమల్టి స్పెషాలిటి ఆసుపత్రిలో సెలైన్ టీయూఆర్పీ, ఆర్ఐఆర్ఎస్ ఆధునిక పద్ధతి ద్వారా కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యంతో శస్త్రచికిత్స చేసి సుమారు వందగ్రాముల ప్రొస్టేటో కంతిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కిడ్ని రాళ్లతో బాధపడుతున్న ఆర్మూర్ మండలం గోవిందపేట్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే వృద్ధుడికి ఒకేసారి సెలైన్‌టీయూ ఆర్‌పి, ఆర్ఐఆర్ ఆధునిక పద్ధతి ద్వారా తొలగించి అదేరోజు రోగికి ఎలాంటి హాని జరగకుండా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. శస్త్రచికిత్స చేసిన 8గంటలకే రోగిని డిస్‌చార్జ్ చేశామన్నారు. ఆర్ఐఆర్ఎస్ పద్ధతి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'విద్యుత్ శాఖ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం'



మాట్లాడుతున్న నాయకులు

సుభాష్‌నగర్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామని 327 ఐఎన్‌టీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అన్నారు. జరగబోయే విద్యుత్ శాఖ ఎన్నికలను 327 ఐఎన్‌టీ యూసీని గెలిపించాలని ఆయన కోరారు. నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సుకోరే ఏకైక యూనియన్ 32 7 ఐఎన్‌టీయూసీ అని అన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రెగ్యూలరైజ్ చేసేందుకు కృషి చేసామని ఈపీఎఫ్ నుంచి సీపీఎఫ్ పెన్షన్ విధానాన్ని కల్పిస్తామని, విద్యుత్ ఉద్యోగులందరికి పరిమితిలేని వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జక్రియా, ప్రధాన కార్యదర్శి పుడారి గంగాధర్, వేణుగోపాల్, మెహర్‌రాజా, రాజేందర్, జాహెర్ అహ్మద్, మొయినొద్దీన్, రాజేశ్వర్, భూమేశ్వర్, వలీన్ కుమార్, స్వామి, శేఖర్, సంపత్‌కుమార్, మురళీకృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'ఖిలాపత్ దివస్‌ను విజయవంతం చేయండి'

నిజామాబాద్ అర్బన్ : సెప్టెంబర్ 1న జిల్లాలో చేపట్టిన సామూహిక సెలవుతో కూడిన ఖిలాఫత్ దివస్‌ను ప్రతీ ఒక్క సీపీఎస్ ఉద్యోగి హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికిరణ్, దేవల్ల గోపాల్ పిలుపునిచ్చారు. నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగి యొక్క ఆర్థిక, సామాజిక భవిష్యత్ ఆందోళనకరంగా ఉండడం వల్ల ఈ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 1న కలెక్టరేట్ సమీపంలో ధర్నాచౌక్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం

సుభాష్‌నగర్: డయల్ యువర్‌ఆర్ఎం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 12 గంటల నుంచి 1 గంటల వరకు నిర్వహిస్తున్నామని నిజామాబాద్ ఆర్ఎం ఖుష్రోషాఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రీజియన్‌లోని ప్రయాణికులు 9959226026 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తగు సూచనలను తెలియజెయాలన్నారు. ప్రయాణికుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

శివపుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం

నిజామాబాద్ కల్చరల్ : నగరంలోని బ్రహ్మపురి శివపుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఉదయం గణపతికి విశేష పూజాది కార్యక్రమాలు మండలి ప్రతినిధులు జరిపారు. అనంతరం మండలి ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మిథున్‌కుమార్, రాజశేఖర్, కిరణ్, ప్రేమ్, రాజు, శేఖర్, ఓంరాజ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనంగా మంగళపూజలు

నిజామాబాద్ కల్చరల్ : నగరంలోని గణపతి మండపాల్లో మంగళవారంను పురస్కరించుకుని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాలల్లో గణపతికి పంచామృతిభిషేకాలు, విశేష గరికపూజలు మండలి నిర్వాహకులు చేశారు. పలు గణపతి మండపాలల్లో గణపతిహోమాలు, అన్నదానాలు జరిగాయి. గణపతికి ఎంతో ఇష్టమైన మంగళవారం కావడంతో భక్తులు మండపాలల్లో పూజలు నిర్వహించడానికి పోటీ పడ్డారు. గణపతి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆంధ్రజ్యోతి
16
నిజామాబాద్ రూరల్
నిజామాబాద్ । బుధవారం 30 ఆగస్టు 2017
నిజామాబాద్ రూరల్ । డిచ్‌పల్లి । సిరికొండ । ధర్పల్లి । జక్రాన్‌పల్లి । మోపాల్ । ఇందల్వాయి

హాకీలో జిల్లా స్థాయి ప్రథమ విజేతలుగా నిలిచిన తూంపల్లి విద్యార్థులు

సిరికొండ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంటులో తూంపల్లి విద్యార్థులు ప్రథమ విజేతలుగా గెలుపొందారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టోర్నీలో 8బాలుర జట్లు, 7బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో ఆర్మూర్ విద్యార్థులపై తూంపల్లి బాలుర జట్టు ప్రథమ విజేతగా గెలుపొందగా, బాలిక విభాగంలో తూంపల్లి బాలిక జట్టు నిజామాబాద్ జట్టుపై గెలుపొందారు. జిల్లా స్థాయిలో తూంపల్లి విద్యార్థులు టైటిల్ దక్కించుకోవడం ఇది మూడో సారి కావడం గమనార్హం. తూంపల్లి విద్యార్థులు హాకీలో తమ ప్రతిభను చూపించడం పట్ల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సర్పంచ్ దేవరాజ్ విద్యార్థులను అభినందించారు.

ఇంటర్వ్యూ

మండలానికి 276 గొర్రెల యూనిట్లు మంజూరు



విఠల్, పశువైద్యాధికారి, ధర్పల్లి

ఆంధ్రజ్యోతి: మండలానికి ఎన్ని గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి ?

పశువైద్యాధికారి: మండలానికి 276 యూనిట్లు మంజూరయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎన్ని యూనిట్లను గ్రౌండింగ్ చేశారు?

పశువైద్యాధికారి: ఇప్పటి వరకు 129 యూనిట్లను గ్రౌండింగ్ చేశాం.

ఆంధ్రజ్యోతి: మిగతా యూనిట్లను ఎప్పటి వరకు పూర్తి చేస్తారు ?

పశువైద్యాధికారి: ప్రస్తుతం 92 యూనిట్లకు నిధులు మంజూరయ్యాయి. గొర్రెల కొనుగోళ్ల కోసం అనంతపురం వెళ్తున్నాము. 92 యూనిట్లు పంపిణీ చేసి మిగతావాటిని వచ్చే నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఈ పథకంలో అక్రమాలు జరుగుతున్నట్లు విమర్శలువస్తున్నాయి ?

పశువైద్యాధికారి: ఈ పథకంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి యూనిట్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తున్నాం. యూనిట్లను రన్ చేసేందుకు ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేశాం. -ధర్పల్లి

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

● పొంచి ఉన్న ప్రమాదం

ధర్పల్లి : మండలకేంద్రంలో గల తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బీసీ కాలనికి వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. సబ్‌స్టేషన్ పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నప్పటికీ ట్రాన్స్‌కో సిబ్బంది మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఈ విద్యుత్ తీగలు చేతికి తాకే విధంగా వేలాడడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా వాహనాల రాక పోకలు అధికంగా ఉండడంతో పాటు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చేతికి తాకేలా ఉన్న విద్యుత్ తీగలు

'ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది'

మోపాల్: ఉపాధ్యాయులు నేర్పిన విద్యతోనే అనేక మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారని బోర్గాం(బి) సర్పంచ్ చిలుక సాయిలు సొసైటి అధ్యక్షులు చంద్ర శేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బోర్గాం(పి) ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పురుషోత్తమ శర్మ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు పాల్గొన్నారు. గ్రామ ఉపసర్పంచ్ చిరంజీవి గంగారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ నాగమణి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సరామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పురుషోత్తమ శర్మను సన్మానిస్తున్న దృశ్యం

'లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం'



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ధర్పల్లి: రూరల్ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిప్ప రిజర్వాయర్ ద్వారా నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో వెలుగులు నింపారన్నారు. ధర్పల్లి ఎంపీపీ గోపి, సిరికొండ ఎంపీపీ, జెడ్పీటీసీలు మంజుల, సుజాదిలీప్, ధర్పల్లి, సిరికొండ టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హిందీ హెచ్‌వోడీని అభినందించిన వీసీ

డిచ్‌పల్లి : తెలంగాణ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్న ప్రవీణాబాయికి మదర్‌థెరిస్సా రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో వీసీ సాంబయ్య మంగళవారం ఆమెను అభినందించారు. యూనివర్సిటీ అభ్యున్నతికోసం కృషిచేస్తున్న అధ్యాపకులను ఆయన అభినందించారు.

ప్రభుత్వ పాలనాశాస్త్రం హెడ్‌గా వెంకటేశ్వర్లు నియామకం

టీయూలో ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం హెడ్‌గా వెంకటేశ్వర్లును మంగళవారం వీసీనియమించారు.

'త్వరలో రూరల్‌వాసులకు తిర్మన్‌పల్లి పీహెచ్ సేవలు'

నిజామాబాద్ రూరల్: తిర్మన్‌పల్లి గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో అతి త్వరలోనే వైద్యులను నియమించి రూరల్ ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం తిర్మన్‌పల్లిలోని కోదండరామాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ భూపతిరెడ్డి మాట్లాడారు. మండల ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సేవకే తన సమయం కేటాయిస్తానన్నారు. ఎంపీపీ యాదగిరి, వైస్ ఎంపీపీ పూర్ణచందర్ పాల్గొన్నారు.



తిర్మన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

రూరల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూరు, తిర్మన్‌పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను టీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి ప్రారంభించారు. మంగళవారం ఆకుల కొండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని అశోక పారంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ నిధుల్లోంచి రూ.5 లక్షలు కేటాయించారు. తిర్మన్‌పల్లిలో మహిళా సమాఖ్య భవన్‌కు రూ.5 లక్షలు మంజూరైన నిధులతో నిర్మించే పనులకు ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పూర్ణచందర్‌రావు, తిర్మన్‌పల్లి సర్పంచ్ కౌలాస్ మోహన్‌లతో కలిసి నిర్మాణ పనులు ప్రారంభించారు.

రేపు బియ్యం వేలం పాట

సిరికొండ: గత నెలలో సిరికొండలో పట్టుకున్న బియ్యాన్ని ఈనెల 31న తహసీల్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వీరసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం తహసీల్ కార్యాలయంలో ఈ నెల 31న నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ కమోడిటీస్ ఆర్డర్ 2008 ప్రకారం లైసెన్సు కలిగి ఉండాలని తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు.

నాసిరకం రోడ్డు నిర్మాణంపై అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి తిర్మన్‌పల్లి వరకు రోడ్డు విస్తర్ణ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని అధికారుల పర్యవేక్షణలేక కాంట్రాక్టర్ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నాడని మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, మిట్టాపల్లి గ్రామ సర్పంచ్ రాజు, ఎంపీటీసీ సవిత, గ్రామవీడీసీ సభ్యులు సంబంధితశాఖ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

'సినారె సాహితీ లోకానికి అంకితం'

డిచ్‌పల్లి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయంలో మంగళవారం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి స్మారకోపన్యాసం కార్యక్రమాన్ని తెలుగు అధ్యాయన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆచార్య కనకయ్య తెలుగు భాషా ప్రతినిధులు సూర్యప్రకాష్, డాక్టర్ లావణ్య, చందన్‌రావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు'

మోపాల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం శ్రీరాజరాజేశ్వర పీఠం శ్రీశ్రీశ్రీ శివకోటి దయానంద స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి గరకపూజ, 108 కలశాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం నగరంలోని గోల్‌హనుమాన్ నుంచి లక్ష్మీగణపతి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త భక్తులు పాల్గొన్నారు.

నేడు కమలాపూర్‌కు ఎంపీ కవిత రాక

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సబ్‌స్టేషన్ నిర్మాణం పనులను ప్రారంభించేందుకు ఎంపీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు రానున్నారని ఎంపీడీవో సురేందర్ తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ధర్పల్లి: ప్రభుత్వం కార్మికులకు అందజేస్తున్న బీమాసౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలనిడిప్యూటీ లేబర్ ఆఫీసర్ యోహాన్ అన్నారు.మండల కేంద్రంలో మంగళవారం భవన నిర్మాణ రంగ కార్మికులకు బీమా సౌకర్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ఇన్సూరెన్స్‌పై జిల్లాలోని ప్రతి మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'కేసీఆర్‌ను విమర్శించే హక్కు రేవంత్‌రెడ్డికి లేదు'

డిచ్‌పల్లి: 14 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు టీడీపీ నాయకుడు రేవంత్‌రెడ్డికి లేదని టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు చింత మహేష్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్‌ను దేరా బాబాగా దూషించడం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. తెలంగాణలో తెలంగాణ దేశం పరిస్థితి దయనీయంగా మారిందని ప్రభుత్వంపై విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. టీఆర్ఎస్వీ నాయకులు భాస్కర్, కృష్ణకాంత్, రవి, మురళి, ప్రసాద్, నిఖిల్ పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి'



ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ అత్తర్‌సుల్తానా

డిచ్‌పల్లి: విద్యార్థినీ, విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడాపోటీల్లో కూడా రాణించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తర్‌సుల్తానా అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో ధ్యాన్‌చంద్ 112 జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్క విద్యార్థి ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ ప్రవీణబాయి, టూటా అధ్యక్షుడు ప్రవీణ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జమీల్ పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: ప్రపంచ హాకీ మాంత్రికుడు,భారత క్రీడా దిగ్గజం ధ్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తిని నేటి తరం క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటి అధ్యక్షుడు ఆర్.నర్సయ్య కోరారు. ధ్యాన్‌చంద్ 112 జయంతి కార్యక్రమాన్ని మంగళవారం సిరికొండలో నిర్వహించారు. ప్రపంచదేశాల్లో హాకీ క్రీడలో ప్రావీణ్యాన్ని,దిశా నిర్దేశాన్ని చూపెట్టిన ధ్యాన్‌చంద్ క్రీడాస్ఫూర్తిని నేటి యువతరం క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు.

జక్రాన్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి : మండలకేంద్రంలోని హైస్కూల్‌లో, బ్రాహ్మణపల్లిలోని గాంధినగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, సైన్స్ సెమినార్‌ను ఘనంగా నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో టీఆర్ఎస్ జిల్లా యువనాయకుడు బాజిరెడ్డి జగన్, ఎంపీపీ రాజన్న, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్న, పాఠశాల కరస్పాండెంట్ మానసలు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్రాన్‌పల్లి హైస్కూల్‌లో జరిగిన హాకీ క్రీడల మంత్రి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అనాథ పిల్లలకోసం విరాళాల సేకరణ

జక్రాన్‌పల్లి : అనాథ పిల్లల కోసం మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన చైతన్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలు రూ. 5560 మాతృ అభయ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీధర్‌కు మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్ అందజేశారు. విద్యార్థులను మాతృఅభయ ఫౌండేషన్ ప్రతినిధి విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

'సింగూరు నుంచి నీటిని విడుదల చేయాలి'

కోటగిరి: మంజీరా నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు సింగూరు నీటి విడుదల విషయమై చేసిన ఒప్పందాలను అమలుచేయాలని ఎత్తొండ విండో అధ్యక్షుడు సోమశేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. 1980లో సింగూరు ప్రాజెక్టును నిర్మించారని, ప్రాజెక్టులో ఉన్న నీటిని ఏ నెలలో ఎంత నిజాంసాగర్‌కు విడుదల చేయాలో ఉన్న నియమ నిబంధనలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తగు చర్యలు తీసుకుని నిజాంసాగర్‌కు దక్కాల్సిన నీటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటర్వ్యూ

గుడుంబా, నాటుసారా తయారు, అమ్మకం జరిపితే చర్యలు



అంజయ్య, ఎస్‌ఐ, వర్ని

ఆంధ్రజ్యోతి: మండలంలోని పలు తండాల్లో గుడుంబా, నాటుసారా తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయని సమాచారం? నిజమేనా?

ఎస్‌ఐ: మండలంలోని ఏ తండాలో కూడా గుడుంబా, నాటుసారా తయారీ కేంద్రాలు కొనసాగడం లేదు. తండావాసులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగింది. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: మండలంలో పేకాట జోరుగా కొనసాగుతుంది? నివారణ చర్యలు చేపడుతున్నారా?

ఎస్‌ఐ: మండలంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే సమాచారం అందించాలి. పేకాట స్థావరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: రాత్రివేళల్లో సక్రమంగా పెట్రోలింగ్ నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి?

ఎస్‌ఐ: అలాంటిదేం లేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- వర్ని

జడ్పీ నిధుల కోసం మంత్రికి వినతి

వర్ని: జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసినట్లు జడ్పీటీసీ గుత్ప భాస్కర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్‌కు నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, నిధుల విడుదలకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు జడ్పీటీసీ తెలిపారు.

'గోవధ జరుగకుండా చూడాలి'

బోధన్ టౌన్: బక్రీద్ పండుగ దృష్ట్యా గోవధ జరుగకుండా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని పాత బోధన్ యువకులు శివ ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయాధికారికి వినతిపత్రం అందజేశారు. బోధన్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం గోవధ చేయవద్దని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. యువకులు గంగాధర్, భరత్, లింగేశ్వర్, మల్లారం దత్తు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 20,176 బతుకమ్మ చీరలు

నవీపేట: మండలంలోని 24గ్రామపంచాయతీల పరిధిలోని అర్హులైన మహిళలకు పంపిణీ చేసేందుకు 20,176 బతుకమ్మ చీరలు మంజూరయ్యాయని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ చీరలు త్వరలో మండలానికి చేరుకోనున్నాయని, సెప్టెంబరు నెల 18, 19 తేదీల్లో ఆయా గ్రామాల్లో అర్హులైన వారికి పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నిధులు.. గౌరవం లేని మండల సమావేశాలు మాకెందుకు?

● సమావేశాన్ని బహిష్కరించిన అధికార పార్టీ ఎంపీటీసీలు



కోటగిరి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కోటగిరి: మూడేళ్లుగా ఎంపీటీసీలుగా ఎన్నికై ప్రజలకు ఏదైనా సేవ చేయాలనుకున్న తమకు ప్రభుత్వం నిధులివ్వడంలోనూ నిర్లక్ష్యం, అధికారులు కనీస గౌరవం ఇవ్వకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు తాము హాజరుకావడమెందుకని సభ్యులు ప్రశ్నించారు. కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ సులోచన అధ్యక్షతన ప్రారంభమైంది. కొద్దిసేపటికే సభ్యులు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ఎంపీటీసీ హోదాలో తాము ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకలేకపోయామని సభ్యులు వాపోయారు. ప్రజల వద్దకు తాము వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. తమకు ఇప్పటి వరకు రెండులక్షల రూపాయలు మాత్రమే నిధులు ఇచ్చారన్నారు. రెండులక్షల రూపాయలతో తాము తీర్మానించిన అభివృద్ధి పనులను సైతం పూర్తిచేయలేని పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు ఆర్ అండ్ బీ ఏఈ ఎంఎఫ్.అలీ రోడ్ల సమస్యలపై తాము ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. తమ ఫోన్ సైతం లిఫ్ట్ చేయని పరిస్థితి నెలకొందని మరికొందరు ఎంపీటీసీలు వాపోయారు. అధికారుల తీరును నిరసిస్తూ అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు ఆసిఫ్, హన్మంత్‌రావు, రాజేశ్వర్‌పటేల్ సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించడంతో సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఈ సందర్భంగా ఎంపీపీ సులోచన మాట్లాడుతూ, ఎంపీటీసీలకు తగిన నిధులు కేటాయించాల్సిన అవసరముందన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్, ఏఎంసీ చైర్మన్ శంకర్‌పటేల్, ఎంపీడీవో అత్తరుద్దీన్, తహసీల్దార్ విఠల్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ మున్నీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సంక్షేమ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్: బోధన్ ఎమ్మెల్యే షకీల్ హైదరాబాద్‌లో మంగళవారం మైనారిటీ సంక్షేమశాఖపై సమీక్ష నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ శాఖ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే షకీల్ అసెంబ్లీహాలులో కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష జరిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ నిధులు, చేపడుతున్న కార్యక్రమాలు, వక్ఫ్‌బోర్డు భూములపై సమీక్ష నిర్వహించినట్లు ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు, ఎమ్మెల్యేలు సంపత్, వినయ్‌భాస్కర్, రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె విరమణ

బోధన్ టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సమ్మెతో ప్రభుత్వం దిగొచ్చింది. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో కార్మిక సంఘాల నాయకులు, అధికారులతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. మెజారిటీ డిమాండ్లను పరిష్కరిస్తామని ఒప్పందం కుదరడంతో సమ్మెను విరమించుకున్నట్లు కార్మిక సంఘం నాయకులు బీ.మల్లేష్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం పట్ల కార్మికులు పర్వయ్య, గంగామణి, మరియా, పోశెట్టి, ప్రభాస్, దత్తు, రాజు, అబ్బవ్వ హర్షం వ్యక్తం చేశారు.

ఆహ్వానంలో పేర్లు లేవని ప్రజాప్రతినిధుల అసంతృప్తి

రుద్రూరు: మండల కేంద్రంలోని ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాల్లో తమ పేర్లు లేవని రుద్రూరు మండల ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సంబంధించిన కళాశాల భవన ప్రారంభోత్సవ ఆహ్వానంలో తమ పేర్లను నమోదు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్, ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు మొదటిగా ఆహ్వాన పత్రికలో మార్కెట్ కమిటీ చైర్మన్ పేరును కూడా ప్రస్తావించకుండానే అందరికీ పంపిణీ చేయడం విశేషం. ఇది గమనించిన మండల నాయకులు వ్యవసాయశాఖ మంత్రి పోచారం దృష్టికి తీసుకువెళ్లగా, చరవాణి ద్వారా సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో మరో ఆహ్వాన పత్రికలో మార్కెట్ కమిటీ చైర్మన్ పేరును రాసి రుద్రూరు మండల ప్రజాప్రతినిధుల పేర్లు ప్రస్తావించకపోవడం విశేషం.

ఫొటో స్టూడియో, ల్యాబ్‌ల బంద్

బోధన్ టౌన్: బోధన్ పట్టణంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో స్టూడియోలు, కలర్ ల్యాబ్‌లను మంగళవారం బంద్ చేసి నిరసన తెలిపారు. పెరిగిన ముడిసరకుల ధరల కారణంగా తాము సైతం చార్జీలను పెంచుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లె రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంఆర్ టీకాను ప్రతి విద్యార్థికీ వేయాలి'

రెంజల్: ప్రతి విద్యార్థీ ఎంఆర్ టీకాను వేసుకున్నప్పుడే తట్టు, రుబెల్లా వ్యాధులను అరికట్టవచ్చని రాష్ట్ర పరిశీలకురాలు సరోజరాణి అన్నారు. ఈ టీకాలపై మండలంలోని కందకుర్తి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించారు. కందకుర్తితోపాటు నీలాలో కొంతమంది విద్యార్థులు ఈ టీకాలకు దూరంగా ఉండటంతో వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, ఎంపీపీ మొబీన్‌ఖాన్, సర్పంచ్ యాదవరావు, డాక్టర్ మధుసూదన్, ఏఎన్‌ఎం వాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం

వర్ని: స్థానిక సీసీడీ ఆవరణలో బుధవారం టీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు మేక వీర్రాజు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై మంత్రి అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ నాయకులు నారోజి గంగారాం, ఇందూరి సాయిలు, జాస్తి శివనాగేశ్వర్‌రావు, భజ్యానాయక్, గోపాల్, కనకరాజు, కరీం పాల్గొన్నారు.

కళాశాల భవన ప్రారంభ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏడీఆర్

రుద్రూరు: మండల కేంద్రంలో ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల నూతన భవన ప్రారంభం బుధవారం ఉండటంతో ఏడీఆర్ లక్ష్మణ్ మంగళవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్స్‌లర్ ప్రవీణ్‌రావు, రాజ్యసభ్య సభ్యుడు డీ.శ్రీనివాస్, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా బుధవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రుద్రూరు వరి, చెరకు పరిశోధనా కేంద్రం అధిపతి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నారోజి గంగారాం, టీఆర్‌ఎస్ నాయకుడు ఇందూరి సాయిలు తదితరులున్నారు.

'రూర్బన్ నిధులతో సమష్టిగా అభివృద్ధి చేసుకుందాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఎడపల్లి: కేంద్రప్రభుత్వం శ్యాంప్రసాద్‌ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మంజూరవుతున్న నిధులతో సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎం పీపీ రజితాయాదవ్, జడ్పీటీసీ బిల్ల సరోజిని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా మూడో విడతలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో తమ మండలాన్ని ఎంపికచేయడం అభినందనీయమని, ప్రస్తుతం 30 కోట్ల రూపాయలు మంజూరవుతాయన్నారు. ఈ నిధులతోపాటు మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తయారుచేసిన 17 అంశాల ప్రణాళికలపై నిధులు మంజూరుచేసుకోవచ్చన్నారు. మంజూరైన నిధులను మండలంలోని గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సద్వినియోగపర్చుకోవాలన్నారు. సుమారు ఈ పథకం ద్వారా మండలానికి వందకోట్ల వరకు పనులు జరుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లత, ఎంపీడీవో రాజేశ్వర్, సర్పంచ్‌లు ఎర్ర అబ్బయ్య, సాయిలు, సావిత్రి, అశోక్‌సింగ్, దశరథ్, పుష్ప, ఉజ్వల మధు, లతాశ్రీ, సునీత, ఎంపీటీసీలు జక్కు పోశెట్టి, ఆకుల శ్రీనివాస్, ప్రమీల, విజయలక్ష్మి, పరిగె అనిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

4

నిజామాబాద్ అర్బన్

నిజామాబాద్ | బుధవారం 30 ఆగస్టు 2017

నిజామాబాద్ దక్షిణం | నిజామాబాద్ ఉత్తరం

'తెలుగు భాష మధురమైనది'

నిజామాబాద్ కల్చరల్ : తెలుగుభాష అపాతమధురమైనదని రాగమాలిక అధ్యక్షుడు డాక్టర్ నీలి రాంచందర్ అన్నారు. మంగళవారం తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని రాగమాలిక జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగమాలిక రసజ్ఞ వేదిక సంస్థ ద్వారా మధుర గీతాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. తెలుగుభాష వికాసానికి కృషిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంగీత విభావని ఏర్పాటు చేసి మధుర సినీగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంమోహన్, వేముల శేఖర్, వన్నెల దాసు, లింబాద్రి, శంకర్‌గౌడ్, చందన్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

నగరంలో 25,403 మందికి పింఛన్‌లు అందుతున్నాయి



చిదుర రమేశ్, నగర పాలక సంస్థ పింఛన్ విభాగం అధికారి

ఆంధ్రజ్యోతి: నగరంలోని ఎన్నివేల మందికి పింఛన్‌లు అందుతున్నాయి ?

అధికారి: నగరంలో 25403 మందికి వివిధ రకాల పింఛన్‌లు అందుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఆసరా పథకం ద్వారా ఎలాంటి వారు పింఛన్ పొందుతున్నారు ?

అధికారి: ఆసరా పథకం ద్వారా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు పింఛన్‌లు పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఇందులోఎంతమంది ఏయే రకాల పింఛన్‌లుపొందుతున్నారు ?

అధికారి: వృద్ధాప్య పింఛన్‌దారులు 7594, వితంతువులు 9403, వికలాంగులు 2622, గీత కార్మికులు 15, చేనేత కార్మికులు 30మంది, బీడీ కార్మికులు 4604, ఒంటరి మహిళలు 944, అభయహస్తం పింఛన్‌దారులు 191 మంది పింఛన్‌లు పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: అర్హులైన కొత్తవారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా ?

అధికారి: అర్హులైన కొత్తవారు తమ పూర్తి వివరాలతో ధృవీకరణ పత్రాలు అందజేస్తే పరిశీలించి ఆసరా పథకంలో అర్హులైతే లబ్ధిదారుల ఎంపిక చేస్తాం.

ఆంధ్రజ్యోతి: నగరంలో మొత్తం ఎన్ని లక్షల రూపాయలు పింఛన్ రూపంలో అందజేస్తున్నారు ?

అధికారి: నగరంలో 25403 మందికి గాను 2కోట్ల 65లక్షల 23వేలు ప్రతి నెల ఆసరా పథకం ద్వారా పింఛన్‌ల రూపంలో అందజేస్తున్నాం.-ఇందూరు

సమస్యల వలయంలో సరస్వతీనగర్

● ధ్వంసమైన సీసీరోడ్లు ●అస్తవ్యస్తంగా మురికి కాలువలు

జర దేఖో..



గుంతలమయంగా రోడ్డు..

ఇందూరు: నగరంలో నడిబొడ్డున ఉన్నప్పటికీ కాలనీలలో పాలకులు, అధికారుల ఉదాసిన వైఖరితో మౌలిక సదుపాయాల కల్పనకు నోచుకోకపోవడంతో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో సదరు కాలనీల ప్రజలు ప్రతినిత్యం సమస్యలతోనే సహవాసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. నగరంలోని ఖలీల్‌వాడిలోని సరస్వతీనగర్ కాలనీలో సిమెంట్ రోడ్లు ధ్వంసమయ్యాయి. సీసీరోడ్లపై గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎప భూగర్భ మురికి కాలువల నిర్మాణంపేర రోడ్లను తవ్విపడేశారు. ప్రగతి ఆసుపత్రి పక్కనే గల రోడ్డు అధ్వాన్నంగా మారింది. భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంతలు సరిగా పూడ్చలేదు. కాలనీలో కొన్ని ప్రాంతాల్లో యూజీడీ పనుల కోసం నడిరోడ్డు మధ్యలో తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో ఇళ్ల పక్కన డ్రైనేజీ నిర్మాణంలేక రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. కొత్తగా మురికి కాలువలు నిర్మాణం లేక మురుగునీరు పక్కన పరిసరాలలో పారి అపరి శుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రాత్రి వేళల్లో ధ్వంసమైన రోడ్లపై నడవడం నరకంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసు ప త్రి వెనకభాగంలో గల ఖాళీ ప్రదేశంలో ప్రతి రోజు చెత్త దర్శనమిస్తుంది. అధికా రులు, పాలకులు దృష్టిసారించి తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు..

దశలవారీగా అభివృద్ధి పనులు చేయిస్తున్నా..



డివిజన్ పరిధిలోని సమస్యలు ఉన్నమాట వాస్తవమే. కొన్నిచోట్ల ఇప్పటికే సీసీరోడ్లు వేయించాం. మరికొన్ని చోట్ల రోడ్లు వేయించాల్సి ఉంది. ప్రాధాన్యతను బట్టి అభివృద్ధి పనులు చేపడతాం. సీసీరోడ్లు మురికికాలువల కొసం ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తాం.

-**కొండపాక జ్యోతి, 8వ డివిజన్ కార్పొరేటర్**

'1న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి'

నిజామాబాద్ అర్బన్ : సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని టీటీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరెల్లి కమలాకర్‌రావ్ కోరారు. మంగళవారం పీఆర్టీయూ భవన్‌లో టీటీజేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1న నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులు సామూహిక సెలవుపెట్టి రావాలని కోరారు. సీపీఎంఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని ఆయన అన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మోహన్ పాల్గొన్నారు.

ఎస్టీ,ఎస్సీ ఉపాధ్యాయ సంఘం..

సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామినాయక్ కోరారు. మంగళవారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జరిగిన సంఘం అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్నాకు అందరూ ఉద్యోగ ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి రావాలన్నారు. జిల్లా నాయకులు సాగర్, సాయిలు, లింగయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఎంబీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లా: వెనుకబడిన వర్గాలకు జనాభప్రాతిపదకన రాజకీయల్లో రిజర్వేషన్‌లు కల్పించాలని ఎంబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసింది కాని జాబితాను ప్రకటించలేదని అన్నారు. వెంటనే జాబితాను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. క్రీమిలేయర్ విషయంలో ఏడాదికి రూ.8లక్షలు సంపాదిస్తున్న వారిలోకి సంచారకులాలవారికి వర్తింపచేయరాదన్నారు. బీసీ-ఏ సంచార, కులవృత్తుల వారు అధికంగా నిరక్ష్యరాసులుగా ఉంటారన్నారు. రానున్న 2019ఎన్నికల్లో బీసీ వర్గీకరణ జనాభ ప్రాతిపదకన చట్టసభల్లో అనుమతి కల్పించాలన్నారు. సమావేశంలో ఎంబీసీ నాయకులు శ్యాంబాబు, సత్యనారాయణ, అనిల్‌కుమార్, వెంకటేశ్, పాల్గొన్నారు.

గణేష్ శోభాయాత్రకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి

● భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

● రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన మేయర్



రోడ్లపై గుంతలను పరిశీలిస్తున్న నగర మేయర్ ఆకుల సుజాత

ఇందూరు: నగరంలో జరిగే గణేష్ నిమజ్జన శోభాయాత్రకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ ఆకుల సుజాత అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని వినాయక నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా దుబ్బ ప్రాంతంలోని శోభాయాత్ర ప్రారంభమయ్యే ప్రదేశం నుంచి కాలినడకన రథం వెళ్లే మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్ర వెళ్లే ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న అక్రమణలను వెంటనే తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు గణేష్ నవరాత్రులలో అందుబాటులో ఉండి పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. రోడ్లపై పాడైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వినాయక్‌నగర్‌లోని వినాయక బావి వద్ద మేయర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నాగేశ్వర్, ఏసీపీ ఉమాదేవి, టీపీవో సత్యనారాయణ, ఇంజనీరింగ్ అధి కారులు, ఎంహెచ్‌వో సాజిద్‌అలీ, స్థానిక కార్పొరేటర్లు పోతుల పురుషోత్తం, పంచరెడ్డి సురేష్, సిర్పసువర్ణ, నితిన్‌పాండే, ఖుద్దూస్, టీఆర్ఎస్ నాయకులు పంచరెడ్డిసూరి, నరేందర్ గౌడ్, ఏఈలు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నీలకంఠేశ్వరాలయ నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారం

నిజామాబాద్ కల్చరల్ : నగరంలోని కంఠేశ్వర్‌లో గల నీలకంఠేశ్వర ఆలయ నూతన పాలకమండలి పదవీ ప్రమాణా స్వీకారోత్సవం బుధవారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యురాలు కవిత, అర్బన్ శాసన సభ్యుడు బిగాల గణేష్ గుప్త, మేయర్ ఆకుల సుజాతలు హాజరుకానున్నారు. ఆలయ చైర్మన్‌గా జగన్‌గుప్త ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

'కమ్మర్‌పల్లి ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్: కమ్మర్‌పల్లి మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ నేతలు జిల్లా కలెక్టర్,డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఆయన గత కొంతకాలంగా ఒక సంఘానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇతర సంఘాలను పట్టించుకోవడం లేదన్నారు. డీఈవో ఆదేశాలను పట్టించుకోకుండా ఇద్దరు ఉపాధ్యాయులను ఎంఆర్‌సీలో పనిచేయిస్తున్నారన్నారు. యూపీఎస్‌లో మూతపడిన కారణంగా స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండితులను సర్దుబాటు చేసే విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులను ఒకచోట నియమించి వారికి టైంటేబుల్ కూడా ఇవ్వలేదని తెలిపారు. హిందీ పండిత్ ఉపాధ్యాయురాలుకు ఇచ్చిన డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని వారు కోరారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు ఉన్నారు.

'మీజిల్స్, రూబెల్లా టీకాలను పిల్లలకు వేయించాలి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, ఏసీపీ

ఇందూరు: మీజిల్స్, రూబెల్లా టీకాలను 15 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పక వేయించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకట్, ఏసీపీ ఆనంద్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్ రోడ్‌పై నిర్వహించిన మీజిల్స్ రూబెల్లా పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఏసీపీ ఆనంద్‌కుమార్, డీఎంహెచ్‌వో వెంకట్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. వారే స్వయంగా గోడలకు, ఆటోలకు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురక్షితమైన మీజిల్స్ రూబెల్లా టీకాలను ప్రతి ఒక్క చిన్నారికి వేయించాలన్నారు. టీకాపై ఉన్న అపోహాలు అవాస్తవమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టాటాబాబు, ఎస్ హెచ్‌వో రవీందర్, సీఐ సుభాష్‌చంద్రబోస్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఇరుకుల వీరేశం, రవీందర్, రాజేశ్వర్, హన్మాండ్లు, గంగాదాస్, లక్ష్మణ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, నరేందర్, మన్మదరావు, ఉప్పుసంతోష్ పాల్గొన్నారు.